నేటి కందం- నేటికి అందం

భారత దేశము తన కతి
చేరువలో నున్నయట్టి చిరుదేశమ్మె
నేరములు చేయు పాక్ తో
తీరుగ తన గగనమునకు తెరలను దించెన్ !!

(భారత్ తన గగన తలాన్ని పాకిస్థాను విమానాలు రాకుండా మూసి వేసింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433    E-mail:netinijam93@gmail.com

ఆఖరుకు ముగిసింది
ఆర్టీసిలో సమ్మె పోరు
సమస్యలు సర్కారు
సమ్మతించే తీర్చ జోరు
గత పాలక అధినేతలు
గొంతు ఎట్లా నొక్కేసిరి
మద్దతుగా ఇప్పుడేమో
మాట ఎట్లా మార్చేసిరి

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 26-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:200 పేజీలు:6 వెల: రూ.1/-

## డీజీపీ సమక్షంలో ఆయుధాల సమర్పణ



హైదరాబాద్, ఏప్రిల్ 25: తెలంగాణ పోలీసుల ముందు భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 47 మంది మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలిశారు.

ఈ సామూహిక లొంగుబాటులో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని ఉన్నతాధికారులు వెల్లడించారు. వీరంతా చాలా కాలంగా అడవుల్లో మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు సమాచారం.

ఈ సందర్భంగా మావోయిస్టులు ఏకే-47, ఎస్ఎల్ఆర్‌లతో పాటు మొత్తం 34 అత్యాధునిక మారణాయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇది భద్రతా వ్యవస్థకు పెద్ద విజయంగా అధికారులు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో పోలీసులు నిఘాను కట్టుదిట్టం చేయడంతో పాటు గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్లు ముమ్మరం చేయడం వల్లే ఈ లొంగుబాటు సాధ్యమైందని తెలుస్తోంది.

ఈ భారీ లొంగుబాటు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న మావోయిస్టు ఉద్యమానికి గట్టి దెబ్బగా భావిస్తున్నారు. తెలంగాణలో మావోయిస్టుల ఉనికి ఇప్పుడు దాదాపు నామమాత్రంగా మారిపోయిందని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. సాయుధ పోరాటం ద్వారా ప్రయోజనం లేదని గ్రహించినవారే ఈ నిర్ణయం తీసుకున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు.. సీఎం నివాసం వద్దకు ర్యాలీకి నిరసకారులు యత్నం



మణిపూర్ ఏప్రిల్ 25: మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం నివాసం వద్దకు ర్యాలీ గా వెళ్లేందుకు నిరసకారులు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులతో ఘర్షణ జరుగడంతో బాష్పవాయు ప్రయోగించారు. ఏప్రిల్ 7న బిష్ణుపూర్ జిల్లాలో ఒక వ్యక్తి ఇంటిపై మోర్టార్ దాడి జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ దాడిలో ఇద్దరు చిన్న పిల్లలు మరణించగా, వారి తల్లి తీవ్రంగా గాయపడింది. దీంతో మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి.

కాగా, శనివారం ఇంఫాల్‌లో మణిపూర్ సమగ్రతా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరు కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించడానికి సీఎం యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిరసనకారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు బాష్పవాయువును ప్రయోగించారు. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు.

## ఉన్నతాధికారులుగా ఎదిగే అవకాశాన్ని జారవిడుచుకోవద్దు: మంత్రి పొన్నం



హైదరాబాద్, ఏప్రిల్ 25: తెలంగాణ నుంచి శిక్షణ పొంది అత్యధిక ర్యాంకులు సాధించాలని సివిల్స్ ఆశావాహులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆలోచనతో సివిల్స్ పరీక్షలు రాస్తున్న వారికి 'రాజీవ్ అభయ హస్తం' పేరుతో ఆర్థిక సహకారం అందిస్తున్నామని తెలిపారు.

శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో బీసీ స్టడీ సర్కిల్ థీమ్ సాంగ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ విడుదల చేశారు. బీసీ స్టడీ సర్కిల్‌లో 100 మందికిపైగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు రాసే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు మోటివేషనల్ థీమ్ సాంగ్‌ను విడుదల చేశామని చెప్పారు.

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ థీమ్ సాంగ్ రూపొందించారని ఆయన వివరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత ఆత్మస్థైర్యంతోపాటు లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు.

బీసీ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి భవిష్యత్తులో ఉన్నతాధికారులుగా ఎదిగే అవకాశాన్ని జారవిడవకుండా కృషి చేయాలని సివిల్స్ ఆశావాహులకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, ఏప్రిల్ 25: తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపామని, వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరించామని పేర్కొన్నారు. ఈరోజు (శనివారం) ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు. అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికుల చిరకాల స్వప్నమని, దాన్ని తాము నెరవేర్చామని పేర్కొన్నారు.

అలాగే కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించడం వంటి అంశాలపై ఆర్టీసీ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నిర్ణయాలను చారిత్రాత్మకంగా అభివర్ణిస్తూ కార్మికులు సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించారని.. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కేడర్ కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలపాటు కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ఇంకా మిగిలిన సమస్యలనూ కూడా దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేసినా, వారి డిమాండ్లు నెరవేర్చలేదని విమర్శించారు.

ఆ సమయంలో 30 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవని, వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నామని చెప్పారు. సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ శవ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరించిన తీరు సరికాదని అభిప్రాయపడ్డారు. 2013 బాండ్లు, 2017 పీఆర్సీ, డీఏలు, సీసీఎస్, పీఎఫ్ బకాయిల చెల్లింపులు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, కారుణ్య నియామకాలు వంటి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్వీసు నుంచి తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నామని ప్రస్తావించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఆర్టీసీ ఒక లైఫ్ లైన్‌లా పనిచేస్తోందని మంత్రి పొన్న ప్రభాకర్ పేర్కొన్నారు.

## రైతులకు గుడ్ న్యూస్.. నిధుల విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఏప్రిల్ 25:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్ లో భూములు ఇస్తున్న రైతులకు ఏపీ మంత్రి నారాయణ శుభవార్త తెలిపారు. ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇస్తున్న రైతులకు మే 1వ తేదీ నుంచి కౌలు నిధులు జమ చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌ను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ కొనసాగుతున్న తీరుపై అధికారులతో మంత్రి నారాయణ ఈరోజు (శనివారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు శ్రవణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, సీఆర్డీఏ కమిషనర్ విజయ రామరాజు, అడిషనల్ కమిషనర్లు భార్గవ తేజ, కార్తీక్, డిప్యూటీ కలెక్టర్లు, ఎమ్మార్వోలు హాజరయ్యారు.

ఇంటర్ నేషనల్ స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వేలైన్, రైల్వేస్టేషన్ కోసం 7 గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఎంజాయ్‌మెంట్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే, లెగసీ వేస్ట్, ఫ్రెష్ వేస్ట్ నిర్వహణ ఏజెన్సీలతో పలు కీలక అంశాలపై మంత్రి నారాయణ చర్చించారు. లెగసీ వ్యర్థాలను త్వరితగతిన పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఫ్రెష్‌వేస్ ప్లాంట్‌ల ఏర్పాటు త్వరగా పూర్తి చేసి వ్యర్థాల నిర్వహణ ప్రారంభించాలని సూచించారు. ప్లాంట్‌ల ఏర్పాటుకు స్థలం ఇబ్బందిగా ఉన్న చోట కలెక్టర్లతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ ఆదేశించారు

## మే 9న ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 25 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశముంది.

ముఖ్యంగా ఓఓఆర్ ఖష్టజీబవ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం.

రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్‌లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఇది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని అధికారిక షెడ్యూల్ పూర్తిగా ప్రకటించాల్సి ఉంది.

## బీజేపీ వస్తే రాత్రి ఒంటిగంటకైనా మహిళలు బయట తిరగొచ్చు.. మమతపై అమిత్ షా విమర్శలు..

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 25:మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటి గంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని అన్నారు.

మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. 'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా..' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు.'గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించడు' అని అమిత్ షా హామీనిచ్చారు.

## హర్మూజ్‌లో.. కలకలం

**-సీమైన్స్ బోట్లు పేల్చేయాలని ట్రంప్ ఆదేశం**
**-రంగంలోకి దిగిన నౌకాదళం**
**-అడ్డుకునేందుకు ఇరాన్ రెడీ**
**-ఇరు పక్షాలు క్షిపణుల మోహరింపు**
**-కాల్పుల విరమణ సమయంలో కొత్త రచ్చ**

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 25: ప్రపంచం మరో మహా యుద్ధం ముంగిట నిలబడిందా.. మధ్యప్రాచ్యంలో ముదురుతున్న ఉద్రిక్తతలు చూస్తుంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయం ఇప్పుడు ప్రపంచ దేశాలను వణికిస్తోంది. స్ట్రెయిట్ ఆఫ్ హర్మూజ్ కేంద్రంగా అమెరికా-ఇరాన్ మధ్య మొదలైన ఈ మైండ్ గేమ్ ఇప్పుడు క్షిపణుల దాడి వరకు వెళ్లేలా కనిపిస్తోంది. గ్లోబల్ ఆయిల్ సప్లైకి గుండెకాయ వంటి ఈ ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

### పెద్దన్న ఆదేశాలు చర్చనీయాంశం..

హర్మూజ్ జలసంధిలో ట్రంప్ ఆదేశాల కలకలం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన నౌకాదళానికి జారీ చేసిన ఒక ఉత్తర్వు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హర్మూజ్ జలసంధిలో ఇరాన్‌కు చెందిన మైన్లు (సముద్రంలో పేలే బాంబులు) బిగించే బోట్లు కనిపిస్తే వెంటనే కాల్చివేయాలని ట్రంప్ ఆదేశించారు. ఇరాన్ తన చిన్న, వేగవంతమైన బోట్ల ద్వారా ఈ కీలక జలమార్గంలో మైన్లను ఏర్పాటు చేస్తూ, ప్రపంచ దేశాలకు వెళ్లే చమురు రవాణాను అడుకోవాలని చూస్తోందని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు అమెరికా నౌకాదళం ఇప్పటికే హర్మూజ్ ప్రాంతాన్ని తమ గుప్పిట్లోకి తీసుకుంది.

హర్మూజ్ విషయంలో అమెరికా రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. మొదటిది, ఇరాన్ కొత్తగా మైన్లు వేయకుండా అడ్డుకోవడం. ఇందుకోసం డ్రోన్లు, నిఘా నౌకల ద్వారా ప్రతి ఇరాన్ బోటును లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇక రెండోది, అత్యంత కష్టమైనది.. ఇప్పటికే సముద్రంలో బిగించిన మైన్లను గుర్తించి తొలగించడం. సముద్ర గర్భంలో ఉన్న బాంబులను వెలికితీయడం ప్రమాదంతో కూడుకున్న పని కావడంతో, అమెరికా తన మిత్రదేశమైన జపాన్ నుంచి మైన్ స్వీపర్ నౌకలను రప్పించేందుకు ప్లాన్ చేస్తోంది. ఈ ఆపరేషన్ సుదీర్ఘకాలం సాగే అవకాశం ఉందని పెంటగాన్ వర్గాలు అంటున్నాయి.

టార్గెట్ ఇరాన్ ఈ ఉద్రిక్తతల మధ్య ఇజ్రాయెల్ కూడా రంగంలోకి దిగింది. ఇరాన్‌పై భారీ ఎత్తున విరుచుకుపడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కేవలం అమెరికా నుంచి గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నామని ఇజ్రాయెల్ రక్షణ శాఖ ప్రకటించింది. ఈసారి దాడులు కేవలం సైనిక స్థావరాలకే పరిమితం కాకుండా, ఇరాన్ ఆర్థిక వెన్నెముక అయిన చమురు, ఇంధన మౌలిక సదుపాయాలపైనే ఉండబోతున్నాయని సంకేతాలిచ్చింది. టెహ్రాన్, టెల్ అవీవ్ మధ్య ప్రస్తుతం ప్రత్యక్ష దాడులు ఆగిపోయినట్లు కనిపిస్తున్నా, లోలోపల పెద్ద యుద్ధానికి సన్నాహాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

ఇరాన్‌కు డీల్ ఆఫర్ అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ తాజా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిలో మా దిగ్బంధం కొనసాగుతోంది. అమెరికా అనుమతి లేనిదే ఏ ఇరాన్ నౌక అక్కడి నుంచి కదలడానికి వీల్లేదు. ఇతర దేశాల వాణిజ్య నౌకలు మా అనుమతితో వెళ్లవచ్చు. ఇరాన్ తన పద్ధతి మార్చుకుని ఒక మంచి ఒప్పందానికి రావడానికి ఇదే ఆఖరి అవకాశం" అని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ఇరాన్ పట్టుదలగా ముందుకు వెళ్తే, అది నేరుగా మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి: డిప్యూటీ డీఎంహెచ్ వో




ఆదిలాబాద్, ఏప్రిల్ 25:మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ వో డాక్టర్ సుధాకర్ నాయక్ కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ సబ్ సెంటర్ పరిధిలోని ఎంపీకే త్రీ ఇంక్లైన్ గ్రామంలో మలేరియా నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా దోమల నుంచి వ్యాపిస్తుందని తెలిపారు.

వ్యాధి లక్షణాలు కనపడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ప్రజలను కోరారు. ప్రజలు మలేరియా బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో 35 మంది ప్రజలకు వైద్య సేవలు అందించారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఝాన్సీరాణి , సర్పంచ్ చందనాల రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్‌యూవో శ్రీనివాస్, సీహెచ్ వో సత్తయ్య, సూపర్‌వైజర్లు తారబాయ్, రమాదేవి, పంచాయతీ సెక్రెటరీ కృష్ణ, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

# ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన విపత్తు - చెర్నోబిల్ అణు విస్ఫోటనం

## (26 ఏప్రిల్ "అంతర్జాతీయ చెర్నోబిల్ విపత్తు స్మరణ దినోత్సవం" సందర్భంగా)

అణు శక్తి అత్యంత శక్తివంతం, అపార విధ్వంసాలకు మారు పేరు. అణు శక్తిని మానవాళి సంక్షేమానికి, ప్రపంచ శాంతి స్థాపనకు ఉపయోగించడంతో పాటు అనాలోచితంగా అణు బాంబుల రూపంలో విధ్వంసానికి కూడా వాడడం జరుగుతుంది. నేటి అమెరికా/ఇజ్రాయిల్ – ఇరాన్ యుద్ధానికి ముఖ్య కారణంగా ఇరాన్ అణు శక్తి సామర్థ్యాలను, యురేనియం నిల్వలను కట్టడి చేయడమే అని వింటున్నాం. నాటి "చెర్నోబిల్ అణు రియాక్టర్ విపత్తు" నేటికీ వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నాటి ప్రజలు, జంతువులు, పంటలు, మౌలిక సదుపాయాలు ప్రభావితం అయ్యాయి. అణుశక్తి వల్ల కలిగే లాభ నష్టాలను గురించి ప్రపంచ ప్రజలకు అవగాహన కల్పించడానికి, నాడు చనిపోయిన అమాయకులను స్మరించుకోవడానికి ఐరాస చొరవతో ప్రతి ఏటా 26 ఏప్రిల్ రోజు ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ చెర్నోబిల్ విపత్తు స్మరణ దినోత్సవం (ఇంటర్నేషనల్ చెర్నోబిల్ డిజాస్టర్ రిమెంబరెన్స్ డే)"ను 2016 నుంచి నిర్వహించడం కొనసాగుతోంది.

### 26 ఏప్రిల్ 1986 నాటి అణు రియాక్టర్ విస్ఫోటన విధ్వంసం:

26 ఏప్రిల్ 1986 రోజున నాటి తెల్లవారుజామున సోవియట్ యూనియన్, నేటి ఉక్రెయిన్‌లోకి చెర్నోబిల్ అణు విద్యుత్ కేంద్రంలో ఒక రియాక్టర్ పేలిపోయి, నేటి బెలారస్, ఉక్రెయిన్, సోవియట్ భూభాగాలకు చెందిన 84 లక్షల మంది సామాన్య ప్రజలు ప్రభావితం కావడం, దీర్ఘకాలిక వినాశకరమైనా పరిణామాలకు దారి తీయటం మనకు తెలుసు. సుమారు 5.2 లక్షల చదరపు కిమీ భూభాగం రేడియోధార్మిక రసాయనాలతో కలుషితం అయ్యింది. ఈ విపత్తు జరిగి నాలుగు దశాబ్దాలు గడిచినా, ఈ ప్రాంత ప్రజలపై, భూభాగంపై తీవ్రమైన దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాలు కొనసాగుతూనే ఉన్నాయి.

నాడు సోవియట్ యూనియన్‌కు చెందిన అణు విద్యుత్ కేంద్రంలో క్షణాల్లో అణు విస్ఫోటనం జరిగి, దాదాపు 520 ప్రమాదకరమైన రేడియోధార్మిక పదార్థాలు వాతావరణంలోకి విడుదలయ్యాయి. చెర్నోబిల్ విపత్తు కారణంగా ఆ ప్రాంతంలో ప్రమాదకర రేడియేషన్‌తో పాటు దీర్ఘకాలిక వాతావరణ కాలుష్యానికి లోనయ్యారు. ఈ విపత్తులో దాదాపు 180 మిలియన్లకు పైగా క్యూరీ రేడియోధార్మిక న్యూక్లైడ్‌లు వాతావరణంలోకి ప్రవేశించాయి. మిలియన్ల ఎకరాల అటవీ, సాగు భూములు కలుషితం అయ్యాయి. తరతరాల ప్రజలపై ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు, పశువులు వైకల్యంతో జన్మించడం కొనసాగుతోంది.

ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన మానవ నిర్మిత విపత్తుల్లో ఒకటిగా 'చెర్నోబిల్ విపత్తు' నిలుస్తున్నది. అణు విద్యుత్ కేంద్రాల భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయడానికి ప్రయత్నాలు నిరంతరం జరగాలి. 40 ఏండ్ల క్రితం జరిగిన ఈ ప్రమాదకర విస్ఫోటనం గురించి, అది మిగిల్చిన విషాదాల గూర్చి, తీసుకోవలసా చర్యల గురించి, వారి జీవితాలను మెరుగుపరవడానికి కావలసిన మార్గాలను ఎంపిక చేసుకొని అమలు పరచడం జరగాలి. ఇలాంటి భయంకర దుర్ఘటన మరే ప్రాంతంలో జరగకుండా చూసుకోవడం మన కనీస బాధ్యత. ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడడం మన కర్తవ్యం. చేతులు కాలకముందే ఆకులు సిద్ధం చేసుకుందాం. మన అలసత్వం లక్షల ప్రజల ప్రాణాలను తీయకుండా జాగ్రత్త పడదాం. అణు విస్ఫోటనాలు కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.



-మధుపాళీ
9949700037

# జనగణనలో భాగంగా రేపటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్




న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 25:జనగణన-2027లో భాగంగా తెలంగాణ రేపటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్, తెలంగాణ డైరెక్టర్ శ్రీమతి భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె పత్రికా సమావేశంలో మాట్లాడారు.

ఈసారి జరుగుతున్న జనగణన ప్రాముఖ్యతను శ్రీమతి భారతీ హోళికెరి వివరిస్తూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన అని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన కూడా ఇదేనని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారి కుల గణన జరుగుతుండటం కూడా ఈసారి జనగణనలో ప్రత్యేకమని పేర్కొన్నారు. ముఖ్యంగా మొదటసారిగా జనగణన ప్రక్రియలో ఈసారి సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియ పాటిస్తున్నామని, ప్రజలు నేరుగా జనగణనలో పాల్గొనేందుకు ఇది ఒక మంచి అవకాశమని ఆమె చెప్పారు.

ప్రజలు https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా, సొంతంగా జనగణనకు తమ వివరాలను అందించవచ్చని శ్రీమతి భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్- ఎన్యుమరేషన్ అనేది తప్పనిసరి కాదని, కేవలం ప్రజలకు ఒక సౌలభ్యం మాత్రమేనని, దీని వల్ల జనగణనలో డేటా సేకరణ వేగవంతమవుతుందని, క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గుతుందని ఆమె చెప్పారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సహా 16 భాషల్లో పోర్టల్ పనిచేస్తుందని, ఈ పోర్టల్ అత్యంత సురక్షితమైనదని, ఇందులో డేటా సురక్షితంగా ఉంటుందని తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి అనుమానాలు ఉన్నా పోర్టల్‌లో ఉన్న సమాచారం నివృత్తి చేస్తుందని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 1855 హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి కూడా తెలుసుకోవచ్చని చెప్పారు.

జనగణనలోని మొత్తం 33 ప్రశ్నలకు గానూ సెల్ఫ్- ఎన్యుమరేషన్ ద్వారా 27 ప్రశ్నలకు జవాబులు ఇవ్వొచ్చని, మిగతా ఆరు ప్రశ్నలకు సమాధానాలను జనగణన ఎన్యుమరేటర్ వచ్చి నమోదు చేసుకుంటారని తెలిపారు. ప్రజలు ఎలాంటి డాక్యుమెంట్లు, ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియలో జియోఫెన్సింగ్ ఉండదని, ప్రజలు ఎక్కడినుంచైనా ఈ ప్రక్రియను పూర్తిచేయవచ్చని అన్నారు.

జనగణన అనేది అన్ని సర్వేలకు మాతృసర్వే వంటిదని, జనగణన ద్వారా సమగ్రమైన డేటా వస్తుందని ఆమె పేర్కొన్నారు. సరైన విధానాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు జనగణన డేటా అత్యంత కీలకమని అన్నారు. మన కోసం, మన పిల్లల కోసం, భావి తరాల కోసం ఈ జనగణన ముఖ్యమైనదని, కాబట్టి, ప్రజలు కచ్చితత్వంతో తమ వివరాలను ఇవ్వాలని, ఇది ప్రజల బాధ్యత అని ఆమె అన్నారు. జనగణనలో వచ్చే డేటా క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రతిబింబించే అద్దంలా ఉండాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో జనగణన ప్రక్రియను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వివరించారు. ఒక డివిజన్‌ను యూనిట్‌గా తీసుకొని జనగణన జరపనున్నట్లు చెప్పారు. క్యూర్ పరిధిలో 21,866 ఎన్యుమరేటర్లు, 3,652 మంది సూపర్‌వైజర్లు జనగణన విధుల్లో ఉంటారని, సర్కిల్‌కు ఒకరు చొప్పున 60 మంది డిప్యూటీ కమిషనర్లు ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారని, కంటోన్మెంట్‌కు ఒకరు ఇన్‌ఛార్జ్‌గా ఉంటారని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా సెల్ఫ్- ఎన్యుమరేషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.

అనంతరం జనగణనకు సంబంధించిన పోస్టర్, ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు.

# భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా జలధార-జలహారతి

**-డ్వామా డైరెక్టర్ షణ్ముఖరావు**

శ్రీకాకుళం, ఏప్రిల్ 25: నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జలధార-జలహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని డ్వామా డైరెక్టర్ షణ్ముఖరావు అన్నారు. జలధార - జలహారతి కార్యక్రమం లో భాగంగా శనివారం శ్రీకాకుళం మండలం సింగుపురం గ్రామం, ఎచ్చెర్ల మండలం ఎస్.యం. పురం గ్రామంలో చెరువులలో జరుగుతున్న పనులతో పాటు లోటుపాట్లును ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఉన్న పాత చెరువులు, కుంటలు, వాటికి అనుసంధానమైన కాలువలు, వంకలు తదితర జల వనరులను పూడికతీత చేయడం, జంగిల్ క్లియరెన్స్ నిర్వహించడం ద్వారా నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించడం వంటి పనులను గుర్తించి చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ చర్యల ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా చెరువుల్లో నిల్వచేసి, భూగర్భ జలాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

చెరువుల ఆధునీకరణ ద్వారా శివారు భూములకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకుకోవాలన్నారు. నీటి నిలువ సామర్థ్యం ఉన్న ఈ చెరువుల్లో నీటి వృథా కాకుండా కాలువలను పటిష్టం చేయాలని అధికారులకు ఆదేంచారు. గ్రామాల్లో వర్షాలు, వరదలు వచ్చినప్పుడు నీటి ప్రవాహ దిశలు, నీరు ఎక్కువగా చేరే ప్రాంతాలు వంటి విషయాల్లో గ్రామ పెద్దలకు ఉన్న అనుభవాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఈ సంవత్సరం వర్షాకాలానికి ముందే అన్ని పనులను పూర్తి చేసి చెరువులు, కుంటలు నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల నిర్వహణలో వీబీ రామ్ జీ పథకాన్ని అనుసంధానం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ లవరాజు, ఏపిడి కె. లోకేశ్వరరావు, ఏపిఓ సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

# మా జీవన ఆధారాన్ని కాపాడండి..

**-తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావుకు రైతుల వినతి**



అమరావతి, ఏప్రిల్ 25:మా జీవనాధారమైన వ్యవసాయ భూములను కాపాడాలని కోరుతూ, క్వాంటం వ్యాలీ ఏపీఐఐసీ ద్వారా కార్పొరేట్ కంపెనీల స్థాపన పేరుతో భూములు స్వాధీనం చేసుకునే ప్రక్రియను నిలుపుదల చేయాల్సిందిగా చీమలపాడు రెవెన్యూ పరిధిలోని కోమటికుంట గ్రామ రైతులు శనివారం తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావును వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ,పంటలపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలకు భూముల కోల్పోవడం తీవ్రమైన ఆర్థిక, సామాజిక సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. పలు తరాలుగా సాగుచేస్తున్న భూములు తమకు కేవలం ఆస్తి మాత్రమే కాకుండా జీవనాధారం, సంస్కృతి, భవిష్యత్తు అని వివరించారు. దీనిపై స్పందించిన శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కోమటికుంట గ్రామంలో ఎంత మేరకు సాగుభూములు ఉన్నాయో, ఎన్ని ఎకరాలు ప్రభావితమవుతున్నాయో రెవెన్యూ అధికారుల ద్వారా సమగ్ర సమాచారం సేకరిస్తామని తెలిపారు. గ్రామంలోని రైతులందరితో కలిసి ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు, సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అభివృద్ధి, రైతుల హక్కులు రెండూ సమానంగా పరిరక్షించబడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పోరేట్ కంపెనీలు రావడం వల్ల స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, రైతులకు నష్టం కలగకుండా సరైన పరిహారం, పునరావాసం కల్పించి న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత శాఖ మంత్రులకు తెలియజేసి రైతుల పక్షాన నిలుస్తామని స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని,ప్రతి రైతుకు న్యాయం జరిగే వరకు తమ కృషి కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి, వేములకొండ సాంబశివరావు, వేములకొండ రామకృష్ణ, చీపు వెంకటేశ్వరరావు, కాసగాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ గుడి నిర్మాణానికి రూ.1.11 లక్షల విరాళం..

**-దాతలను అభినందించిన సర్పంచ్ బనీషా నాయక్**
**-మియాపూర్‌లో చెక్కు అందజేత**

నల్గొండ, ఏప్రిల్ 25: మండలంలోని సూర్య తండా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు పెద్ద మనసుతో విరాళాలు అందజేశారు. కొండాపూరం గ్రామానికి చెందిన కీ.శే. అట్టెపల్లి లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం అయన కుమారులు అట్టెపల్లి పురుషోత్తం, అట్టెపల్లి రాంప్రభులు మియాపూర్‌లోని తమ నివాసంలో రూ.1,01,100 విరాళాన్ని అందించారు. అలాగే అట్టెపల్లి శ్రీరాములు రూ.10,116 విరాళంగా ఇచ్చారు.



సూర్య తండా సర్పంచ్ మునావత్ బనీషా నాయక్, ఉపసర్పంచ్ శంకర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు హమ్యానాయక్, బి ఆర్ ఎస్ నాయకుడు జాజునాయక్, గ్రామస్తులు నారాయణ, రవి, విజయ్, శ్రీను తదితరులు మియాపూర్ వెళ్లి దాతల నుంచి చెక్కులను స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బనీషా నాయక్ మాట్లాడుతూ.. "గ్రామంలో ఆంజనేయ స్వామి గుడి నిర్మాణం కోసం తమ తండ్రిగారి జ్ఞాపకార్థం విరాళం అందించిన అట్టెపల్లి పురుషోత్తం, రాంప్రభులకు, శ్రీరాములు కి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వారి దాతృత్వం గ్రామాభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎంతో తోడ్పడుతుంది" అని కొనియాడారు. ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని ఉపసర్పంచ్ శంకర్ నాయక్ తెలిపారు. దాతల సహకారంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందని గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ గ్రామ పంచాయతీ పాలకవర్గం ధన్యవాదాలు తెలిపింది.

# అంజన్న ఆలయ నిర్మాణానికి విరివిగావిరాళాలు..

ఆదిలాబాద్, ఏప్రిల్ 25: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలపరిధిలోనిబిజ్వార్ గ్రామంలో శ్రీ వ్యాసరాయుల మహర్షిచే ప్రతిష్టించిన శ్రీ పడమటి ఆంజనేయ స్వామి గర్భాలయ పునర్నిర్మాణానికి భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చేందుకు ముందుకొచ్చి తమ భక్తిని చాటుతున్నారు. దేవాలయ పునర్నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు అందజేస్తుండగా శనివారం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య గౌడ్,సుశీల దంపతులు తమ వంతు సహకారంగారూ.25 వేలుఆలయ కమిటీ సభ్యులకు సమర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంలో తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నరసింహ చారి జోషి,వార్డు సభ్యులు రాఘవేందర్,సుధాకర్ రెడ్డి,మహేష్ గౌడ్,దరిమిది నరసింహులు,సప్పటి నరసింహ,సి రమేష్,హరినాథ్ గౌడ్,శశికాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కూలీల భద్రత రక్షణకు సౌకర్యాలు ఏర్పాటు..

బఉపాధి హామీ కూలీల కు పనులు చేసే చోట భద్రత రక్షణకై సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని కొమరం భీం అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని దుబ్బగూడ సర్పంచ్ మడవి కౌసల్య భీమ్రావు, ఉప సర్పంచ్ పేందూరు అనసూయ బాయి రాము అన్నారు. శనివారం దుబ్బగూడాలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలించారు. కూలీల కోసం ఏర్పాటు చేసిన నీడ సౌకర్యం మంచినీటి వసతి ఇలాంటి సౌకర్యాలను పరిశీలించి వారితో మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉందని ఎండలు మధురకముందే పనులు ముగించు కోవాలని అన్నారు. పనులు చేసేటప్పుడు ఎవరికైనా ప్రమాదవశాత్తు దెబ్బలు తగిలితే ప్రథమ చికిత్స కోసం చికిత్స పరికరాలు అందుబాటులో ఉంచామని వారు తెలిపారు. పనులు చేసేటప్పుడు కూలీలు అలసిపోతే నీడ సౌకర్యంతో పాటు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య,ఉప సర్పంచ్ పెందుర్ అనుసయబాయి, సీనియర్ మెట్ తుమ్రం జంగు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ, సంస్థాగత సమన్వయ బలోపేతానికి నషా ముక్త్ భారత్ అభియాన్ యాప్ 2.0 ప్రారంభం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 25: దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించే లక్ష్యంతో సామాజిక న్యాయం, సాధికారత శాఖ 2020 ఆగస్టు 15న అత్యంత ప్రభావితమైన 272 జిల్లాల్లో 'నషా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎంబీఏ)ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం సాధించిన విజయంతో 2023 ఆగస్టు 15 నుంచి దీనిని దేశంలోని అన్ని జిల్లాలకు విస్తరించారు. సామాన్యుల్లో మత్తు పదార్థాల వాడకం పట్ల చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు సహా వివిధ స్థాయిల్లో నిర్వహించిన 8.3 లక్షలకు పైగా కార్యక్రమాల ద్వారా సుమారు 26 కోట్ల మందికి పైగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో 9.5 కోట్లకు పైగా యువత, 6.47 కోట్ల మంది మహిళలు, 28,000 మందికి పైగా మాస్టర్ వాలంటీర్లు భాగస్వాములు కావడం విశేషం.

మాదకద్రవ్యాల డిమాండును తగ్గించే జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్ఏపీడీడీఆర్) పర్యవేక్షణ, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. పంజాబ్ గవర్నర్, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ శశ్రీ వీరేంద్ర కుమార్ 2026 ఏప్రిల్ 24న చండీగఢ్‌లో జరిగిన చింతన్ శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆధునీకరించిన నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) 2.0 యాప్‌ను ప్రారంభించారు.

ఈ ఆధునిక అప్లికేషన్ కేంద్ర, రాష్ట్ర, జిల్లా, సంస్థాగత స్థాయిల్లో అమలు చేసే సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడానికి, ఎప్పటికప్పుడు నివేదికలను పంపించేందుకు, పర్యవేక్షించడానికి రాష్ట్రాలు, జిల్లాలకు ఒక కేంద్రీకృత డిజిటల్ సాధనంగా ఉపయోగపడుతుంది. ఈ కొత్త వెర్షన్ ఇప్పటికే ఉన్న సౌకర్యాలను కొనసాగిస్తూనే.. పారదర్శకతను, జవాబుదారీతనాన్ని, డేటా ఆధారిత పాలనను పెంపొందించే లక్ష్యంతో సరికొత్త ఫీచర్లను పరిచయం చేస్తుంది.

ప్రస్తుతం అధికారిక వినియోగదారులకు అందుబాటులో ఉన్న ఎన్ఎంబీఏ యాప్ రాష్ట్రాలు, జిల్లాలు, ఆధ్యాత్మిక సంస్థలు, ఇతర భాగస్వాములకు 'నషా ముక్త్ భారత్ అభియాన్' కింద తాము చేపట్టిన కార్యకలాపాలను అప్‌లోడ్ చేయడానికి సహాయపడుతుంది. అలాగే ఒక కేంద్రీకృత డ్యాష్‌బోర్డు ద్వారా వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి తోడ్పడుతుంది. ఇది సమాచార, విద్యా, ప్రసార సమాచారాన్ని అందించడమే కాకుండా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనే 'నషా ముక్తి మిత్ర'లకు అవసరమైన ప్రాథమిక కమ్యూనికేషన్ మద్దతును కూడా అందిస్తుంది. ఈ యాప్‌లో మాస్టర్ వాలంటీర్లను (నషా ముక్తి మిత్ర) చేర్చుకోవడం, సమన్వయం చేయడం కోసం సులభమైన వ్యవస్థ ఉంది. విద్యాసంస్థలు, ఇతర సంస్థలు తమ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ప్రతిజ్ఞా కార్యక్రమాలను నిర్వహించడానికి కూడా ఇది వీలు కల్పిస్తుంది. మత్తు పదార్థాల విముక్తి కోసం హెల్ప్‌లైన్, మానస్ హెల్ప్‌లైన్ వంటి ముఖ్యమైన నంబర్ల ద్వారా మానసిక ఆరోగ్య సేవలతోపాటు ప్రాథమిక సాంకేతిక సహాయాన్ని ఈ యాప్ అందిస్తుంది.

మాదకద్రవ్యాల డిమాండు తగ్గింపు ప్రయత్నాలను సమర్థవంతంగా అమలు చేయడానికి, సంస్థాగత యంత్రాంగాలను బలోపేతం చేయడానికి, డిజిటల్ వేదికలను ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని ఎన్ఎంబీఏ 2.0 యాప్ ఆవిష్కరణ తెలియజేస్తుంది.

# కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ
## లక్నోలో ఉత్తర మండల వ్యవసాయ సదస్సు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించిన ఉత్తర మండల వ్యవసాయ సదస్సు, వ్యవసాయానికి ఒక నూతన దృక్పథాన్ని, నవీకరించిన కార్యాచరణ ప్రణాళికను, రైతు కేంద్రీకృత విధానాన్ని ప్రదర్శించే ఒక ముఖ్యమైన వేదికగా ఆవిర్భవించింది. ఈ సదస్సులో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, ఉత్తర ప్రదేశ్ ముఖ్య మంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రు లు, ఆరు రాష్ట్రాలు మరియు మూడు కేంద్ర పాలిత ప్రాంతాల మంత్రులు పాల్గొన్నారు.

ప్రారంభ సమావేశంలో శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మరియు యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, శాస్త్రీయ పరిశోధనలు రైతుల పొలాలకు సమర్థవంతంగా చేరినప్పుడు, ప్రభుత్వ పథకాలు చిన్న రైతులకు సమర్థవంతంగా ప్రయోజనం చేకూర్చినప్పుడు, మరియు ప్రతి రాష్ట్రం తన భౌగోళిక, వాతావరణ పరిస్థితుల ఆధారంగా స్పష్టమైన వ్యవసాయ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినప్పుడు మాత్రమే వ్యవసాయ అభివృద్ధి తదుపరి దశ విజయవం తమవుతుందని నొక్కి చెప్పారు.

గతంలో ఖరీఫ్, రబీ పంటల పై చర్చలు ఒకే దేశవ్యాప్త సమావేశం ద్వారా జరిగేవని, ఇది భారతదేశం వంటి విశాలమైన దేశంలో ప్రాంతాల వారీ సవాళ్లను పరిష్కరించే సామర్థ్యాన్ని పరిమితం చేసిందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. జోనల్ సమావేశాలను ప్రవేశపెట్టడం వల్ల నేల రకం, వాతావరణం, పంటల విధానాలు, ప్రాంతీయ సవాళ్ల ఆధారంగా లోతైన చర్చలకు, మెరుగైన వ్యూహాలకు అవకాశం కలుగుతుందని ఆయన వివరించారు. ఉత్తర ప్రాంత ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలు హరిత విప్లవానికి నాయకత్వం వహించాయని, ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఉత్తర ప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. పండ్లు, పువ్వులు, కూరగాయలతో సహా ఉద్యానవన రంగంలో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ–కాశ్మీర్‌లకు ప్రత్యేక బలాలు ఉన్నాయని కూడా ఆయన సూచించారు. అందువల్ల, అనుభవాలను పంచుకోవడానికి మరియు సామూహిక వ్యూహాలను అభివృద్ధి చేయడానికి ఈ సమావేశం ఒక విలువైన వేదికగా ఉపయోగపడుతుంది.

కేంద్ర మంత్రి మూడు ప్రాథమిక జాతీయ లక్ష్యాలను వివరించారు: ఆహార భద్రతను నిర్ధారించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం మరియు పౌష్టికరమైన ఆహారాన్ని అందించడం. ఈ లక్ష్యాలను సాధించడానికి వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, ఖర్చులను తగ్గించడం, రైతుల శ్రమకు మరియు పంట నష్టాలకు సరైన పరిహారం అందించడం, మరితయు వ్యవసాయంలో వైవిధ్యీకరణను ప్రోత్సహించడం అవసరమని ఆయన పేర్కొన్నారు.

పెరుగుతున్న ఎరువుల వాడకంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, పెరిగిన వినియోగం వాస్తవ అవసరాలపై ఆధారపడి ఉందా లేక సాంప్రదాయ పద్ధతులపై ఆధారపడి ఉందా అని అంచనా వేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సమతుల్య ఎరువుల వాడకం, నేల ఆరోగ్య పరిరక్షణ, సహజ వ్యవసాయం మరియు భవిష్యత్తు కోసం సేంద్రియ ప్రత్యా మ్నాయాలను అవలంబించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన ఉద్ఘాటించారు. నాణ్యమైన విత్తనాలు వ్యవసా యానికి పునాది అని ఆయన మరింతగా హైలైట్ చేశారు మరియు విభిన్న వాతావరణ పరిస్థితులకు అనువైన విత్తనాల లభ్యతను నిర్ధారించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అనూహ్యమైన వాతావరణ సరళి మరియు తక్కువ వర్షపాతం కురిసే అవకాశం గురించి ప్రస్తావిస్తూ, పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడంతో సహా వ్యవసాయ ప్రణాళిక మారుతున్న పరిస్థితుల కు అనుగుణంగా మారాలని ఆయన పేర్కొన్నారు.

## పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు ఎఫ్‌టిఓ యొక్క 2వ దశను విడుదల చేశారు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: మంత్రి శ్రీ రామ్ మోహన్ నాయుడు గారి నాయకత్వంలోని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ,డిజిసిఏ ఆమోదించిన ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్ యొక్క రెండవ దశ ర్యాంకింగ్‌ను (ఏప్రిల్ 2026) విడుదల చేసింది. మంత్రి గారి మార్గదర్శకత్వంలో ఈ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ అభివృద్ధి చేయబడింది, దీని మొదటి దశ ర్యాంకింగ్ 1 అక్టోబర్ 2025న ప్రచురించబడింది.ఎఫ్‌టిఏ రూపొందించిన ఈూ ర్యాంకింగ్ విధానం అనేది, ఆఉఅం ఆమోదం పొందిన ఫ్లయింగ్ శిక్షణా సంస్థలన్నింటిలో శిక్షణా ప్రమాణాలను బలోపేతం చేయడం, భద్రతను పెంచడం మరియు జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్న ఒక చారిత్రాత్మక సంస్కరణ. ఈ డేటా ఆధారిత ఫ్రేమ్‌వర్క్, ఈూ పనితీరును నిష్పక్షపాతంగా పోల్చడానికి మరియు నిరంతరం పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తుంది.

ఈ సందర్భంగా తన దార్శనికతను పంచుకుంటూ మంత్రి ఇలా అన్నారు, "దేశంలో ఎఫ్‌టిఏ ర్యాంకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడంలో నా ప్రధాన లక్ష్యం, పైలట్ శిక్షణను మరింత పారదర్శకంగా చేయడం మరియు యువతకు విమానయానాన్ని మరింత ఆకర్షణీయమైన వృత్తి ఎంపికగా మార్చడమే. పైలట్ కావాలనుకుంటున్న క్యాడెట్లు మరియు వారి కుటుంబాలతో నేను జరిపిన సంభాషణల ఆధారంగా, వారి నిర్ణయాలలో స్పష్టతను మరియు విశ్వాసాన్ని తీసుకువచ్చే ఒక వ్యవస్థను సంస్థాగతం చేయాలనేది ఆలోచన."

# నకిలీ విత్తనాలు, పురుగుమందులపై కఠినమైన చట్టం సిద్ధం: శ్రీ చౌహాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:ఉత్తర భారతదేశంలో వ్యవసాయానికి, సాగుకు కొత్త దిశానిర్దేశం చేసే లక్ష్యంతో నిర్వహించిన ఉత్తర ప్రాంతీయ వ్యవసాయ సదస్సు సందర్భంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, వ్యవసాయ అభివృద్ధి భవిష్యత్ మార్గం ఇకపై అన్ని ప్రాంతాలకు ఒకే విధమైన విధానంతో నిర్ణయించబడదని అన్నారు. వ్యవసాయ ప్రణాళిక ఇప్పుడు ప్రాంతీయ అవసరాలు, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత మరియు స్థానిక పంటల పరిస్థితులకు అనుగుణంగా సాగాలని ఆయన అన్నారు.

లక్నోలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్, రబీ పంటల వ్యూహం, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలలో స్వావలంబన, వ్యవసాయంలో వైవిధ్యం, చిన్న రైతులకు సమీకృత వ్యవసాయం, కిసాన్ క్రెడిట్ కార్డ్, రైతు ఐడీ, సహజ వ్యవసాయం, ఎరువుల రాయితీ, బంగాళాదుంప రైతలకు ఉపశమనం, నకిలీ వ్యవసాయ ఉత్పాదకాలపై కఠిన చట్టాల రూపకల్పన వంటి అంశాలపై వివరంగా మాట్లాడారు. వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా, సుస్థిరంగా, రైతు కేంద్రీకృతంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తాయని ఆయన అన్నారు.

లక్నోలో జరిగిన ఉత్తర ప్రాంతీయ వ్యవసాయ సదస్సును కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ సమన్వయానికి ఒక విస్తృత వేదికగా అభివర్ణించింది. మీడియాతో మాట్లాడుతూ, దేశంలోని వివిధ ప్రాంతాలలో వాతావరణం, నీటి వనరులు, భూమి పరిస్థితులు మరియు పంట సరళి భిన్నంగా ఉంటాయని శ్రీ చౌహాన్ అన్నారు. అందువల్ల, వ్యవసాయ వాస్తవాలన్నింటినీ పరిష్కరించడానికి ఒకే జాతీయ సదస్సు సరిపోదని భావించినట్లు ఆయన తెలిపారు.

ఈ ఆలోచనతో, దేశాన్ని ఐదు ప్రాంతాలుగా విభజించి, ఐదు ప్రాంతీయ వ్యవసాయ సదస్సులను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. లక్నోలో జరుగుతున్న ఈ సదస్సు ఆ పరంపరలో రెండవ దశ.భారత ప్రభుత్వానికి వ్యవసాయ అభివృద్ధి పథకాలు, అధికారులు, పరిశోధనా సంస్థలు మరియు గణనీయమైన శాస్త్రీయ సామర్థ్యం ఉన్నాయని ఆయన అన్నారు. అయితే, వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మాత్రమే పథకాల వాస్తవ అమలు సాధ్యమవుతుంది. ఈ కారణంగా, రాష్ట్రాలతో కలిసి ఖరీఫ్, రబీ సీజన్‌ల కోసం ఒక పూర్తి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. అదే సమయంలో, రైతుల ఆదాయం, ఉత్పత్తి మరియు మార్కెట్‌లను నేరుగా ప్రభావితం చేసే కీలక సమస్యలను కూడా చర్చల బల్లపైకి తీసుకువస్తున్నారు.

చర్చల పరిధి ఇకపై కేవలం ఖరీఫ్, రబీ పంటలకు మాత్రమే పరిమితం కాదని కేంద్ర మంత్రి అన్నారు. వ్యవసాయాన్ని ఎలా వైవిధ్యపరచాలి, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా ఎలా మార్చాలి, పప్పుధాన్యాలు మరియు నూనెగింజల విషయంలో భారతదేశం ఎలా స్వయం సమృద్ధి సాధించాలి, ఉద్యానవనం మరియు ప్రాసెసింగ్‌ను ఎలా ప్రోత్సహించాలి వంటి ముఖ్యమైన ప్రశ్నలు ఈ సదస్సులో ప్రధానంగా ఉంటాయి.

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశం కొత్త రికార్డులు సృష్టించిందని, గోధుమ, వరి దిగుబడిలో గణనీయమైన పురోగతి సాధించబడిందని ఆయన అన్నారు. వరి ఉత్పత్తిలో దేశం అగ్రస్థానానికి చేరుకుందని, గోధుమ ఉత్పత్తి మెరుగుపడటంతో 50 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమల ఎగుమతికి కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆయన తెలిపారు.

# ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్లపై ఉక్కుపాదం
### –కృష్ణా జిల్లాలో ఎనిమిది మంది అరెస్ట్



అమరావతి, ఏప్రిల్ 25:ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌ల వలలో చిక్కి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. బెట్టింగ్ కార్యకలాపాల వల్ల అనేక మంది అప్పుల బారిన పడి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. దీనివల్ల వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ నిర్వాహకులు, పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ స్పష్టం చేశారు.

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం గన్నవరం ఇంచార్జ్ డిఎస్పి పాల శ్రీనివాసరావు నేతృత్వంలో ఉయ్యూరు సీఐ టీ.వీ.వీ రామారావు బృందం పట్టణంలోని పలుచోట్ల ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టయిన వారులో కూరాడ రాంబాబు (35), కొండపాటి జగదీష్ (23), సత్తివాడ సంపత్ కుమార్ (29), భూరెల రవి కుమార్ (33), వడ్డిపల్లి సురేష్ బాబు (43), కుమరాపు వినయ్ కుమార్ (23), రొండ పేర్రెడ్డి (57), గుండపు వేణు (30) ఉన్నారు

12 మందిపై కేసులు.. పరారీలో మరో నలుగురు

పోలీసులు నిందితుల నుండి సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం 12 మందిపై కేసులు నమోదు చేయగా, ప్రస్తుతం పరారీలో ఉన్న మారదని ప్రసాద్, బతుల నాగ దుర్గా ప్రసాద్, కొండపల్లి హరి, పంద్రాజు సత్యనారాయణల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల బ్యాంక్ లావాదేవీలు, సాంకేతిక సమాచారం ఆధారంగా ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరికొందరిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# చికిత్స పొందుతూ ఉపాధి హామీ పథకం కూలి మృతి

అమరావతి,ఏప్రిల్ 25:ఘంటసాల మండలం తెలుగురావుపాలెంలో ఉపాధి హామీ పథకం పనిలో భాగంగా పంట బోదు తవ్వుతున్నటువంటి ఉపాధి హామీ కూలి అగ్నిహోత్రం రాజేష్ ఎండ దెబ్బకు గురై వెనక్కి పడిపోవడం జరిగింది. తోటి కూలీలు దగ్గరలోని హాస్పిటల్ కి తీసుకెళ్లగా పరీక్షిం చిన వైద్యుడు వెంటనే విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్ళమని చెప్పాడు. దీంతో బాధితుడి బంధువులు విజయ వాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ఉపాధి హామీ పథకం ఏపీఓకు సమాచారం చెప్పినప్పటికీ స్పందించలేదని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. ఎండిఓకు సమాచారం తెలియజేస్తానని చెప్పిన ఏపీవో ఎంతవరకు స్పందించకపోవడం పట్ల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చందోలు జైపాలుడు మాట్లాడుతూ తెలుగురావుపాలెం గ్రామానికి అగ్నిహోత్రం రాజేష్‌కు తనకు బావమరిది అన్నారు.

ఉపాధి హామీ పథకంలో పని చేస్తూ వెనక్కి పడిపోవడంతో తలకు గాయం కావడంతో రాజేష్ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. తెల్లవారుజామున 6 ఉదయం గంటలకు అగ్నిహోత్రం రాజేష్ విజయవాడ ఏలూరు రోడ్డులోని ప్రభుత్వాసుపత్రిలో మరణించాడని తెలిపారు. ప్రభుత్వం స్పందించి బాధితుడు కుటుంబానికి పరిహారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే జయసూర్య..
### –ఎమ్మెల్యే గిత్త
### –శ్రీవారి చెంత ఎమ్మెల్యే జయసూర్య
### –ప్రజల క్షేమమే నా మొక్కు

తిరుపతి, ఏప్రిల్ 25: తిరుమల కొండపై కొలువైన ఆ దేవదేవుడికి మొక్కులు చెల్లించారు



నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రజల చల్లని దీవెనలే నాకు శ్రీరామరక్ష" అంటూ శ్రీవారి దర్శనంతో పులకించిపోయారు. కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం జరిగిందని అన్నారు ఆలయ గోపురం వద్ద టీటీడీ కమిటీ సభ్యులు ఘనంగా ఆహ్వానించారు అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రత్యేక పూజలు స్వామికి విశేష పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ.నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని వేడుకున్నాను" అని తెలిపారు.శ్రీవారి దర్శనం లభించడం నా పూర్వజన్మ సుకృతం. స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మాంద్ర సురేంద్ర నాథ్ రెడ్డి రవీంద్రబాబు మద్దిలేటి రాజశేఖర్ సతీష్ రాంబాబు ఆచారి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# ఏప్రిల్ 24-26 తేదీల్లో చండీగఢ్‌లోని చింతన్ శిబిరంలో స్మైల్-బెగ్గరీ సర్వే మొబైల్ యాప్ ప్రారంభం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 25:కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 2026 ఏప్రిల్ 24 నుంచి 26 వరకు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో చండీగఢ్‌లో నిర్వహించిన చింతన్ శిబిరం సందర్భంగా 'స్మైల్ బెగ్గరీ'(భిక్షాటన) సర్వే మొబైల్ యాప్‌ను ప్రారంభించింది.

భిక్షాటనలో నిమగ్నమైన వ్యక్తుల సమగ్ర పునరావాసం కోసం ఉద్దేశించిన స్మైల్–బెగ్గరీ ఉప–పథకం కింద ఈ సరికొత్త మొబైల్ అప్లికేషన్‌ను ప్రభుత్వం రూపొందించింది. క్షేత్రస్థాయిలో పథకం అమలును మరింత బలోపేతం చేయడం, ఎప్పటికప్పుడు డేటా సేకరణ, మెరుగైన పర్యవేక్షణే లక్ష్యంగా ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. అమలు చేసే సంస్థలు, జిల్లా అధికారులకు సర్వే వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసేందుకు ఈ యాప్ వీలు కల్పిస్తుంది. దీని వల్ల సమాచార సేకరణలో ఖచ్చితత్వం, పారదర్శ కత పెరగడంతో పాటు సకాలం లో నివేదికలు అందించడం సాధ్యమవుతుంది.

గతంలో డేటా రిపోర్టింగులో తలెత్తే జాప్యం, అస్థిరత వంటి సవాళ్లను అధిగమించడంలో ఈ మొబైల్ యాప్ ప్రారంభం కీలక మైలురాయిగా నిలవనుంది. అలాగే దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో పనుల పురోగతిని పర్యవేక్షించడం, డేటా విశ్లేషణ, పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విషయంలో మంత్రిత్వ శాఖ సామర్థ్యాన్ని ఇది గణనీయంగా పెంచుతుంది.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రిత్వ శాఖ వారు మాట్లాడుతూ.. "భిక్షా వృత్తి ముక్త్ భారత్" (భిక్షాటన లేని భారత్) సాధించాలన్న ప్రభుత్వ దార్శనికతకు ఈ కార్యక్రమం పూర్తి అనుగుణంగా ఉంటుందని చెప్పారు.

ఈ యాప్ రాకతో పథకానికి సంబంధించిన మొత్తం పర్యవేక్షణ యంత్రాంగం మరింత శక్తిమంతం కానుంది. గుర్తించిన వ్యక్తులను తిరిగి సమాజ ప్రధాన స్రవంతిలోకి చేర్చేందుకు, వారు ఆత్మవిశ్వా సంతో, గౌరవంగా జీవితాన్ని గడిపేలా చేసేందుకు సాంకేతికతతో కూడిన పరిష్కారాలను వినియోగించుకోవడమే కాకుండా, సంస్థాగత వ్యవస్థలను బలోపేతం చేయడానికి తాము కట్టుబడి ఉన్నట్లు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నెలాఖరులోగా లబ్ధిదారులకు అందించాలి



కరీంనగర్, ఏప్రిల్ 25:జిల్లాలోని రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నెలాఖరులోగా లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.

శనివారం రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి పరిశీలించి, అక్కడి మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఇళ్ల వద్ద నీరు, విద్యుత్, రహదారులు తదితర ప్రాథమిక సదుపా యాలను త్వరితగతిన పూర్తి చేయాని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని స్పష్టం చేశారు. అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జంగాలపల్లి, పాములపేటలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామగుండం మండలంలోని న్యూ మారేడుపాకలో ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## దళితరత్న అవార్డు గ్రహీతకు ఎంపీ సన్మానం

హైదరాబాద్, ఏప్రిల్ 25:మహనీయుల ఉత్సవాల సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజున హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో కల్వకుర్తికి చెందిన మాల మహానాడు నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాసులుకు దళిత రత్న అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు రావుల శ్రీనివాసులకు శాలువాతో సన్మానించి అభినందించారు. దళిత ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. దళిత రత్న అవార్డు రావడం తనకు ఎంతో సంతోషం కలిగించిందని శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రత్నమాల, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ , మాజీ ఎంపిటిసి రాం పర్వతాలు, మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, నాయకులు రావుల చెన్నకేశవులు, గోరటి జంగయ్య పాల్గొన్నారు.

# రెండో దశ ఎఫ్‌టీవో ర్యాంకింగ్‌ను విడుదల చేసిన పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: డీజీసీఏ ఆమోదం పొందిన విమానయాన శిక్షణ సంస్థల (ఎఫ్‌టీవోలు) రెండో దశ (2026 ఏప్రిల్) ర్యాంకింగ్‌లను.. మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. మంత్రి మార్గనిర్దేశంలో ఈ ర్యాంకింగ్ వ్యవస్థను రూపొందించగా.. 2025 అక్టోబరు 1న మొదటి దశ ర్యాంకింగ్‌లు ప్రచురితమయ్యాయి.

డీజీసీఏ ఆమోదం పొందిన విమానయాన శిక్షణ సంస్థల్లో ప్రమాణాలను పెంచడం, భద్రతను మెరుగుపరచడం, జవాబుదారీతనాన్ని పెంపొందించడం లక్ష్యంగా.. ఈ కీలక సంస్కరణను డీజీసీఏ చేపట్టింది. విమానయాన శిక్షణ సంస్థల పనితీరును నిష్పాక్షికంగా పోల్చడానికి, వాటిని నిరంతరం పర్యవేక్షించడానికి ఈ డేటా ఆధారిత విధానం దోహదపడుతుంది.

ఈ సందర్భంగా మంత్రి తన అభిప్రాయాలను పంచుకున్నారు. "పైలట్ శిక్షణలో పారదర్శకతను పెంచడం, యువతకు విమానయాన రంగాన్ని ఒక ఆకర్షణీయమైన వృత్తి మార్గంగా నిలపడమే.. ఈ ర్యాంకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడం వెనుక నా ముఖ్యోద్దేశం. పైలట్లు కావాలనుకుంటున్న ఆశావహులు, వారి కుటుంబ సభ్యులతో జరిగిన నా చర్చల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. వారు సరైన నిర్ణయం తీసుకునేలా స్పష్టతను, నమ్మకాన్ని కలిగించే ఓ వ్యవస్థను సంస్థాగతం చేయాలన్నదే నా ఆలోచన" అని ఆయన వెల్లడించారు.

ఈ రంగంలో అవకాశాలు క్రమంగా పెరుగుతున్నాయని మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. "ప్రాంతీయ విమానయాన అనుసంధానంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ విప్లవాత్మక దృక్పథంతో.. భారతీయ గగనతలం నేడు సరికొత్త అవకాశాలతో కళకళలాడుతోంది. మరో 50 విమానాశ్రయాల ఏర్పాటు, దేశ విమానయాన సంస్థలు మరో 500 విమానాలను సమకూర్చుకోవడం, హబ్ అండ్ స్పోక్ విధానంతో ప్రధాన భారతీయ విమానాశ్రయాలు రవాణా కేంద్రాలుగా రూపుదిద్దుకోవడం ద్వారా.. వచ్చే అయిదేళ్లలో దేశ వైమానిక రంగం భారీగా పురోగమించబోతున్నది. వీటికితోడు సవరించిన ఉడాన్ పథకం ద్వారా, మునుపెన్నడూ లేనివిధంగా కేటాయించిన రూ. 29,000 కోట్లతో ప్రాంతీయ అనుసంధానానికి కూడా భారీగా వెసులుబాటు కలుగుతుంది. దాంతో విమానయాన రంగంపై ఆసక్తి ఉన్న భారతీయ యువతకు వృత్తిపరంగా గొప్ప అవకాశాలు లభిస్తాయి. వచ్చే దశాబ్ద కాలంలో దేశంలో దాదాపు మరో 30,000 మంది పైలట్ల అవసరం ఉంటుందని అంచనా" అని ఆయన వివరించారు.

ఎఫ్‌టీవో ర్యాంకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి.. భారత విమానయాన శిక్షణ రంగంలో పలు సానుకూల పరిణామాలను గమనించవచ్చు. శిక్షణ నిమిత్తం విమానాలు గాల్లో ప్రయాణించే సమయం 32 శాతం నుంచి 50 శాతానికి పెరగడం, వివిధ శిక్షణ సంస్థల్లో విమానాల సంఖ్య పెరగడం, శిక్షణ సామర్థ్యం మెరుగుపడడం వంటివి ఇందులో ముఖ్యమైనవి. ఫలితంగా అభ్యర్థులు సీపీఎల్‌ను పొందేందుకు అవసరమైన ఫ్లయింగ్ నిబంధనలను పూర్తి చేయడానికి పట్టే సమయం తగ్గింది.

అంతేకాకుండా నిష్పాక్షికమైన పనితీరు సూచికల ఆధారంగా, పైలట్ ఆశావహులు తెలివైన నిర్ణయాలు తీసుకునేందుకు ఈ ర్యాంకింగ్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా నిలవాలన్న దేశ లక్ష్యానికి అనుగుణంగా.. భారత్‌లో పైలట్ శిక్షణ మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా ఈ కార్యక్రమం ఒక కీలక ముందడుగు.

"ఉన్నతమైన మా ఆశయం రెండు విధాలుగా ఉంది. మొదటిది- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకునేలా భారతీయ ఎఫ్‌టీవోలను ప్రోత్సహించడం ద్వారా అంతర్జాతీయంగా వాటి పోటీతత్వాన్ని పెంచడం. రెండోది- 'ట్రైన్ ఇన్ ఇండియా, ఫ్లై ఇన్ ఇండియా' నినాదంతో పైలట్ శిక్షణలో స్వావలంబనను సాధించడం. ఎఫ్‌టీవో విధానాన్ని సరళీకరించడం, విమానాశ్రయ రాయల్టీలను రద్దు చేయడం, భూమి అద్దెలను క్రమబద్ధీకరించడం సహా.. ఈ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా అనేక చర్యలు తీసుకున్నాం. అలాగే, సులభతర వాణిజ్యాన్ని పెంపొందించడం కోసం.. సీపీఎల్ పరీక్షల ప్రక్రియను డీజీసీఏ పూర్తిగా డిజిటలీకరించింది. చరిత్రాత్మక భారతీయ వాయుయాన్ అధినియమం ప్రకారం.. ఇప్పుడు సీపీఎల్, ఆర్టీఆర్ లైసెన్సుల కోసం ఒకే విండో విధానం అందుబాటులోకి వచ్చింది'' అంటూ దేశంలో పైలట్ శిక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన చర్యలను మంత్రి వెల్లడించారు.

"విమానయాన శిక్షణలో అనేక ప్రోత్సాహకరమైన చర్యల ఫలితంగా.. గత ఎనిమిదేళ్లలో జారీ చేసిన సీపీఎల్‌ల సంఖ్య 2.5 రెట్లకు పైగా పెరిగింది. 2024, 2025 సంవత్సరాల్లో ఈ సంఖ్య రికార్డు స్థాయికి చేరింది. గత 18 నెలల్లో ఆరు కొత్త ఎఫ్‌టీవోలకు అనుమతి లభించింది. మరో ఆరు సంస్థలు అనుమతి పొందే ప్రక్రియలో ఉన్నాయి" అని ఈ రంగంలో పురోగతిని మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు వివరించారు.

దేశంలో పైలట్ శిక్షణ కోసం పారదర్శకమైన, పనితీరే ప్రమాణంగా, నాణ్యత ప్రాతిపదికగా ఉన్న వ్యవస్థను నెలకొల్పాలన్న పౌర విమానయాన మంత్రిత్వ శాఖ లక్ష్యానికి ఈ రోజు విడుదల చేసిన రెండో దశ ఎఫ్‌టీవో ర్యాంకింగ్ నిదర్శనం. ఎఫ్‌టీవోల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండేలా, అన్ని అంశాలనూ పరిగణిస్తూ నిర్ణయం తీసుకునే అవకాశాన్ని విద్యార్థులకు అందిచేలా.. ఈ వ్యవస్థను మరింత బలంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

ఎఫ్‌టీవో ర్యాంకింగ్ (2026 ఏప్రిల్) ముఖ్యాంశాలు:

ఒక ఎఫ్‌టీవో 'ం' కేటగిరీలో స్థానం సాధించింది. గత దశలో ఏ సంస్థ కూడా ఈ కేటగిరీకి అర్హత సాధించలేదు. దానితో పోలిస్తే విశేషమైన మెరుగుదలగా దీన్ని పేర్కొనవచ్చు.

'అ' కేటగిరీలోని ఎఫ్‌టీవోల సంఖ్య తగ్గడం, 'ః' కేటగిరీలోని ఎఫ్‌టీవోల సంఖ్య పెరగడం.. మొత్తంగా వాటి పనితీరు ప్రమాణాల్లో మెరుగుదలను సూచిస్తుంది.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉరన్ అకాడమీ (ఐజీయూఆర్ఏ) ఈ ర్యాంకింగ్‌లో విశేష పురోగతి సాధించింది.

కార్యాచరణ సామర్థ్యం, భద్రతా నిబంధనలను పాటించడం, శిక్షణ ఫలితాల్లో.. పలు ఇతర ఎఫ్‌టీవోలు విశేష పురోగతిని కనబరిచాయి.

డీజీసీఏ ఆమోదం పొందిన పైలట్ శిక్షణ సంస్థల (2026 ఏప్రిల్) ర్యాంకింగులు కింది విధంగా ఉన్నాయి:

## భూటాన్‌లో 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్న బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ యొక్క ప్రాజెక్ట్ దంతక్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 25: బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ యొక్క ప్రాజెక్ట్ దంతక్, ఏప్రిల్ 1961 లో స్థాపించబడినప్పటి నుండి రాజ్యంలో 65 సంవత్సరాల అంకితమైన సేవకు గుర్తుగా, ఏప్రిల్ 24, 2026న భూటాన్‌లోని థింపులో తన 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భం భారతదేశం మరియు భూటాన్ మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి గల శాశ్వత నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వృత్తిపరమైన నైపుణ్యం మరియు సామాజిక భాగస్వామ్యం రెండింటినీ ప్రతిబింబించే అనేక కార్యక్రమాలతో జరుగు తున్నాయి. వీటిలో థింపులో నిర్వహించిన అంతర్-పాఠశాల క్విజ్ పోటీ, విశిష్ట సిబ్బందిని సన్మానించడం మరియు విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన వారికి గంభీరమైన నివాళి అర్పించడం వంటివి ఉన్నాయి.

భూటాన్ యొక్క మొట్టమొదటి మోటారు వాహన యోగ్యమైన రహదారిని నిర్మించడం నుండి కీలకమైన జాతీయ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వరకు, ప్రాజెక్ట్ దంతక్ దేశవ్యాప్తంగా అనుసంధానం మరియు అభివృద్ధికి ఒక మూల స్తంభంగా పరిణామం చెందింది మరియు భూటాన్ యొక్క సామాజిక-ఆర్థిక పరివర్తనలో కీలక పాత్ర పోషించింది. ఈ ప్రాజెక్ట్ కింద, ట్రాషిగాంగ్‌ను థింపుతో కలిపే వ్యూహాత్మకంగా కీలకమైన తూర్పు-పశ్చిమ రహదారితో సహా 1,500 కిలోమీటర్లకు పైగా రహదారి నిర్మించబడింది. ఫుయెం టోలింగ్-థింపు రహదారి, పారో అంతర్జాతీయ విమానాశ్రయం మరియు యోంగ్‌ఫులా విమానాశ్రయం నిర్మాణంలో ఇది కీలక పాత్ర పోషించింది. అంతేకాకుండా, భూటాన్ అంతటా వంతెనలు, జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు, టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఆసుపత్రులు, పాఠశాలలు మరియు ఇతర కీలకమైన సంస్థాగత సౌకర్యాల అభివృద్ధికి ఇది విస్తృతంగా దోహదపడింది.

# శ్రీవారికి రూ.94.80 లక్షల విలువైన బంగారు పతకాలు విరాళం



తిరుపతి, ఏప్రిల్ 25:తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం బెంగుళూరుకు చెందిన డాక్టర్ ఎం.మహదేవమ్మ రూ.94.80 లక్షలు విలువైన 753 గ్రాములున్న 7 బంగారు పతకాలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి బంగారు పతకాలను అందజేశారు.

హైదరాబాద్ కు చెందిన డాక్టర్ గీతిక సాయి శుక్రవారం టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్ట్ కు రూ. 10,01,116 విరాళంగా అందించారు. అదేవిధంగా హైదరాబాద్ కు చెందిన ఏసీఎస్ టెక్నాలజీస్ సంస్థ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. 10,01,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాతల తరఫున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవోకు విరాళం డీడీలను అందజేశారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



నల్గొండ, ఏప్రిల్ 25:ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జి రవి డిమాండ్ చేశారు. శనివారం కట్టంగూర్ మండలంలోని మునుకుంట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. లారీ కొరతతో కాంటాలు వేయడం లేదని రైతులు తెలుపడంతో అక్కడే వారితో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, మిల్లర్ల నిర్లక్ష్యంతో కొనుగోళ్ల ప్రక్రియ మందగించిందని విమర్శించారు.

వారానికి ఒక లారీ కూడా ధాన్యం ఎగుమతి కావడం లేదని, అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లను చేపట్టకపోతే సోమవారం తాసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు గంగనబోయిన వీరాంజనేయులు, అఖిల భారత రైతు కూలీ సంఘం బూరుగు సత్తయ్య, నిమ్మనగోటి రాములు, చిలుముల సాయిలు, గంట రాములు, వల్లపు వెంకన్న, గద్దగూటి సత్తయ్య, పిచ్చమ్మ, సైదమ్మ, మల్లేశ్వరీ, నాగమ్మ, సైదులు పాల్గొన్నారు.

# భారత్ టాక్సీ ముంబైకి విస్తరించింది.. ముంబైలో భారత్ టాక్సీ డ్రైవర్ ఆన్‌బోర్డింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన శ్రీ పీయూష్ గోయల్





న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 25:పట్టణ రవాణాను బలోపేతం చేయడానికి మరియు డ్రైవర్ల జీవనోపాధిని మెరుగుపరచడానికి ఒక ముఖ్యమైన అడుగుగా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి మరియు ముంబై నార్త్ పార్లమెంట్ సభ్యులు అయిన శ్రీ పీయూష్ గోయల్, 23 ఏప్రిల్, 2026న ముంబైలో భారత్ టాక్సీ డ్రైవర్ ఆన్‌బోర్డింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కండివాలి వెస్ట్‌లోని కమలా విహార్ స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది ఆటో-రిక్షా మరియు క్యాబ్ డ్రైవర్లు, రవాణా సంఘాల ప్రతినిధులు మరియు సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు. డ్రైవర్ల భాగస్వామ్యాన్ని పెంచే, పారదర్శకతను మెరుగుపరిచే మరియు మెరుగైన సంపాదన అవకాశాలను కల్పించే వ్యవస్థీకృత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు ప్రాప్యతను విస్తరించడమే ఈ కార్యక్రమం లక్ష్యం.

సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భారతదేశం యొక్క అభివృద్ధి చెందుతున్న మొబిలిటీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో సహకార మరియు సాంకేతికత ఆధారిత నమూనాల ప్రాముఖ్యతను శ్రీ పీయూష్ గోయల్ నొక్కి చెప్పారు. పారదర్శకత, ఆదాయాలు మరియు శ్రమ గౌరవాన్ని మెరుగుపరిచే డిజిటల్ సాధనాల ద్వారా డ్రైవర్లు భాగస్వాములుగా పాల్గొనేందుకు భారత్ టాక్సీ వీలు కల్పిస్తుందని ఆయన అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు భారతదేశ పట్టణ రవాణా వ్యవస్థల భవిష్యత్ దిశను సూచిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ప్రధాన నగరాల్లో డ్రైవర్లకు ప్రాధాన్యతనిచ్చే మొబిలిటీ వ్యవస్థలను బలోపేతం చేసే విస్తృత ప్రయత్నాలలో భాగంగా ఈ ఆన్‌బోర్డింగ్ డ్రైవ్ ఉంది. ఆన్‌బోర్డింగ్ ప్రక్రియలను సులభతరం చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం మరియు రైడ్ డిమాండ్‌కు మరింత స్థిరమైన ప్రాప్యతను నిర్ధారించడం ద్వారా, ఈ కార్యక్రమం డ్రైవర్లు మరియు ప్రయాణికుల కోసం ఒక సుస్థిరమైన మరియు సమ్మిళిత పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఢిల్లీ ఎన్‌సిఆర్, గుజరాత్, చండీగఢ్ మరియు లక్నో వంటి నగరాలలో వ్యవస్థీకృత మొబిలిటీ నెట్‌వర్క్‌లు స్థిరంగా విస్తరిస్తున్నాయి, ఇప్పుడు ముంబై కూడా ఆ నగరాల పెరుగుతున్న నెట్‌వర్క్‌లో చేరింది.

ఇటీవలి కార్యాచరణ సూచికలు ఈ ప్లాట్‌ఫారమ్ వృద్ధిని ప్రతిబింబిస్తున్నాయి. నగరాల వ్యాప్తంగా ప్రతి నెలా 5.17 లక్షలకు పైగా డ్రైవర్లు ఇందులో నిమగ్నమై ఉండగా, 50 లక్షలకు పైగా కస్టమర్లను చేర్చుకున్నారు మరియు దాదాపు 10 లక్షల రైడ్‌లను సులభతరం చేస్తున్నారు. ఈ సందర్భంగా భారత్ టాక్సీ సీఓఓ శ్రీ వివేక్ పాండే మాట్లాడుతూ, ముంబై అధిక సామర్థ్యం గల మార్కెట్ అని, స్థానిక డ్రైవర్ యూనియన్ల నుండి లభించిన బలమైన మద్దతు, ప్లాట్‌ఫారమ్ విస్తరణ ప్రణాళికలపై మరియు నగరంలో పటిష్టమైన డ్రైవర్ పర్యావరణ వ్యవస్థను నిర్మించాలనే దాని నిబద్ధతపై విశ్వాసాన్ని మరింత పెంచిందని అన్నారు.

రాబోయే మూడేళ్లలో భారతదేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో భారత్ టాక్సీని నడపాలన్న గౌరవనీయ హోం మరియు సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా దార్శనికతకు ఈ విస్తరణ అనుగుణంగా ఉంది. ఈ జాతీయ వృద్ధి రోడ్‌మ్యాప్‌లో ముంబై ఒక కీలక మైలురాయిగా నిలుస్తుంది. మహానగర ప్రాంతాలలో డ్రైవర్లు మరియు ప్రయాణికుల మారుతున్న అవసరాలకు స్పందించే సాంకేతికత ఆధారిత, సమ్మిళిత మరియు సహకార మొబిలిటీ ఫ్రేమ్‌వర్క్‌లను ప్రారంభించడంపై ప్రభుత్వం నిరంతరంగా దృష్టి సారిస్తోందన్న విషయాన్ని ఈ కార్యక్రమం నొక్కి చెబుతోంది.

## చింతన్ శిబిర్‌లో యాచకులు, ఆశ్రయ గృహాల సంరక్షణ, పునరావాసం, నిర్వహణ కోసం నమూనా మార్గదర్శకాల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఈ నెల 24 నుంచి 26 వరకు చండీగఢ్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో నిర్వహించిన చింతన్ శిబిర్ సందర్భంగా... యాచకులు, ఆశ్రయ గృహాల సంరక్షణ, పునరావాసం, నిర్వహణ గురించిన నమూనా మార్గదర్శకాలను ఆవిష్కరించింది.

నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు, సామర్థ్యం, పోషణ, ఆహార భద్రత, వృత్తి శిక్షణ, పునరావాసం, న్యాయ సహాయం, అవగాహన, చైల్డ్-జెండర్ సెన్సిటివిటీ, జవాబుదారీతనం, పర్యవేక్షణ వంటి కీలక రంగాలను కవర్ చేస్తూ ఈ మార్గదర్శకాలు ఒక సమగ్రమైన విధాన ప్రణాళికను అందిస్తాయి. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పైన పేర్కొన్న ఆదేశాలను ఏకరీతిగా అమలు చేయడానికి వీలుగా వాటిని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో సమ్మిళితం చేయాల్సిన ఆవశ్యకతను ఇవి స్పష్టం చేస్తాయి. దేశవ్యాప్తంగా ఉన్న యాచకుల, ఆశ్రయ గృహాల్లో మానవతా పూర్వక, గౌరవప్రదమైన జీవన పరిస్థితులను నిర్ధారించడానికి, ఈ మార్గదర్శకాలను పరిపూర్ణంగా, సమర్థంగా అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది.

# గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యుల క్షీరాభిషేకం

నల్గొండ, ఏప్రిల్ 25: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల వర్షం వ్యక్తం చేస్తూ తుంగతుర్తి మండల కేంద్రంలో శనివారం మండల ఆర్య వైశ్యుల సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి, సీఎం రేవంత్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర పండుగగా వాసవి మాత జయంతిని గుర్తించడం ఎంతో శుభపరిణామం అని ఆర్యవైశ్యులు అన్నారు. ఆర్యవైశ్యుల చిరకాల కోరికను గౌరవించినందుకు సీఎం, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మండల ఆర్యవైశ్య మహాసభ సంఘం నాయకులు ఈగ నాగన్న, ఓరుగంటి అంతయ, తాటికొండ సీతయ్య, పోలవరపు సంతోష్, ఈగల లక్ష్మయ్య, శరీరాల మల్లయ్య, బుద్దా వీరన్న, మాశెట్టి వెంకన్న, గోపారపు సత్యనారాయణ, గుండా శ్రీనివాస్ బండారు నాగన్న, తల్లాడ శ్రీను, ఓరుగంటి సుభాష్, ఓరిగంటి శ్రీను, తల్లాడ చుక్కయ్య, ఈగ సోమయ్య, రామ నరసయ్య పాల్గొన్నారు.


# ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

– వైద్యాధికారి డాక్టర్ రమ్య

నల్గొండ, ఏప్రిల్ 25:ఇల్లు, ఇంటి పరిసరాల్లో వారానికి ఒకసారి నీరు నిల్వ లేకు ఒడా డ్రై డే పాటించాలని, దోమలు పెరగ కుండా నియంత్రించాలని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రమ్య అన్నారు. అంతర్జాతీయ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆత్మకూర్ ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శని వారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశం నుండి 2030 నాటికి మలేరియా అంతం చేయాలనే తపన ఇప్పుడు మనం చేయగలం అనే నినాదంతో ప్రజలలో అవగాహన కల్పించడం జరుగు తుందని తెలిపారు.ఎవరైనా జ్వరం బారిన పడినట్లయితే ఆరోగ్య సిబ్బంది లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు నిర్వహించుకుని నిర్ధారణ అయితే మందులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి చెరుకు యాదగిరి, హెల్త్ సూపర్‌వైజర్ భూతరాజు సైదులు, మాణిక్య, నర్సింగ్ ఆఫీసర్ మానస, మహబూబా, హెల్త్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు విరాళం

ఖమ్మం, ఏప్రిల్ 25:టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాల సందర్భంగా గ్రామ సర్పంచ్ బోడా బాలు నాయక్ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయంగా రూ. 25,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తనవంతు ఐదు సంవత్సరాల పాటు సహాయం కొనసాగిస్తానని తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి పరచాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సెబీ దేశవ్యాప్త పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం 'మిషన్ జాగరూక్'నూ ప్రారంభించిన కేంద్ర ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్, ఈ రోజు ముంబయిలో జరిగిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) 38వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో కీలకోపన్యాసం చేశారు.

సెబీ దేశవ్యాప్త పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం 'మిషన్ జాగరూక్'నూ ఈ సందర్భంగా శ్రీమతి సీతారామన్ డిజిటల్‌గా ప్రారంభించారు.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి సీతారామన్ మాట్లాడుతూ... కొత్తగా తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సెబీ సిద్ధంగా ఉండాలని కోరారు. వాటిలో అత్యంత ముఖ్యమైనది సైబర్ సెక్యూరిటీ సవాళ్లేనని ఆమె పేర్కొన్నారు. ఒక ప్రధాన ఎక్స్ఛేంజ్, డిపాజిటరీ, క్లియరింగ్ కార్పొరేషన్, పెద్ద బ్రోకర్‌పై జరిగే ఒక్క విజయవంతమైన సైబర్‌దాడి... జాతీయ స్థాయిలో మార్కెట్లను అస్తవ్యస్తం చేయగలదని, మదుపరుల సంపదను తుడిచిపెట్టగలదని అన్నారు. అలాంటి ఘటనలతో కోల్పోయిన ప్రజల విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి సంవత్సరాలు పట్టవచ్చని శ్రీమతి సీతారామన్ పేర్కొన్నారు. ఏఐ ఆధారిత సాధనాలు సైబర్‌దాడులను వేగవంతంగా, మరింత అనుకూలంగా, విస్తరించగలిగేలా, కొన్ని సందర్భాల్లో అమలులో మరింత స్వయంప్రతిపత్తితో ఉండేలా చేస్తున్నాయని ఆమె అన్నారు. ఈ ప్రమాదాలు అనేక రూపాల్లో ఉండవచ్చని ఆమె తెలిపారు. సిస్టమ్ బలహీనతలను స్వయంచాలకంగా కనుగొనడం, హానికరమైన సోర్స్-కోడ్ ప్రమేయం, సాఫ్ట్‌వేర్ సరఫరా గొలుసులను లక్ష్యంగా చేసుకున్న దాడులు, గుర్తింపును తప్పించుకోవడానికి ఎప్పటికప్పుడు పరిణామం చెందగల సమన్వయ చొరబాట్లు ముఖ్య ప్రమాదాలని శ్రీమతి సీతారామన్ వివరించారు. "అందువల్ల, కేవలం సెబీ మాత్రమే కాకుండా, అన్ని నియంత్రిత సంస్థలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. దాడి చేసే సాధనాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. రక్షణ సాధనాలు అంతకంటే వేగంగా అభివృద్ధి చెందాలి" అని కేంద్ర ఆర్థిక మంత్రి అన్నారు.

సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగిన పరిస్థితుల్లో సోషల్ మీడియాలో నకిలీ పెట్టుబడి వీడియోలు, యాప్‌లు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిలో చాలా వరకూ ప్రముఖులను అనుకరిస్తూ డీప్‌ఫేక్ ఏఐని ఉపయోగిస్తున్నాయనీ కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

ఏప్రిల్ 2025లో అమల్లోకి వచ్చిన సైబర్ సెక్యూరిటీ-సైబర్ రెసిలెన్స్ విధాన ప్రణాళిక ద్వారా ఈ విషయంగా సెబీ ప్రశంసనీయ కృషి చేసిందని ఆర్థిక మంత్రి శ్రీమతి సీతారామన్ అన్నారు. ఇది ఒక పటిష్ఠ పునాది... దీనిపై మరింత కృషి అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

సంక్లిష్టమైన మార్కెట్ అవకతవకల నమూనాలను, నెట్‌వర్క్ ఆధారిత మోసాలను గుర్తించడానికి సెబీ డేటా అనలిటిక్స్-డిజిటల్ ఫోరెన్సిక్స్ ప్రయోగశాల అధునాతన విశ్లేషణలు, ఏఐ, ఎంఎల్ నమూనాలను ఉపయోగిస్తోందని ఆర్థిక మంత్రి తెలిపారు. డబ్బు బదిలీ చేయడానికి ముందు, నమోదిత మధ్యవర్తుల చెల్లింపు వివరాలను పెట్టుబడిదారులు ధ్రువీకరించుకోవడానికి వీలు కల్పించే "సెబీ చెక్"ను ప్రవేశపెట్టిన సెబీని శ్రీమతి సీతారామన్ ప్రశంసించారు. "ఇవి ముఖ్యమైన చర్యలు. వీటిని గురించి అత్యవసరంగా, విస్తృతంగా అవగాహన కల్పించాలి" అని ఆమె అన్నారు. ప్రభుత్వ అధికారులమని చెప్పుకునే మోసపూరిత కంటెంట్‌పై వేగవంతమైన తొలగింపు యంత్రాంగాల ద్వారా, ప్రాంతీయ భాషల్లో ప్రతి ప్రధాన వేదికపై విస్తృత ప్రచారాలను అందుబాటులో ఉంచడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడానికి సెబీ భారీగా పెట్టుబడి పెట్టాలని ఆమె కోరారు.

ఆర్థిక సామర్థ్యానికి, సమర్థ పాలనకు సౌమ్యమైన నియంత్రణ విధానం, ప్రజా సంప్రదింపులు అత్యవసరమని ఆర్థిక మంత్రి శ్రీమతి సీతారామన్ అన్నారు.

అతి వివరాలతో కూడిన నియమావళికి బదులుగా, సాధ్యమైనంత వరకు సూత్రాల ఆధారిత నియంత్రణను ప్రోత్సహించాలని సూచించారు. నిబంధనల పాటింపు నాణ్యతను, సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి నియంత్రణ ప్రక్రియలో ప్రజా సంప్రదింపులను ఏకీకృతం చేస్తామని కేంద్ర బడ్జెట్ 2023లో స్పష్టంగా పేర్కొన్నట్లు ఆర్థిక మంత్రి గుర్తు చేశారు.

ప్రజాభిప్రాయాలను కోరడంతో పాటు కమిటీలు, మార్కెట్ భాగస్వాములతో సంప్రదింపులు జరపడం వంటి సంప్రదింపుల మార్గాన్ని సెబీ అనుసరించడం అభినందనీయమని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

శ్రీమతి సీతారామన్ మాట్లాడుతూ, "మన పెట్టుబడిదారులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు, మన ఇష్యూయర్‌లు అంతర్జాతీయ మూలధన నిధులను సమీకరిస్తున్నారు. ఒక ప్రధాన అధికార పరిధిలోని నియంత్రణపరమైన పరిణామాలు దాని సరిహద్దులకు ఆవలా మార్కెట్ పద్ధతులను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి"... అందుకే నియంత్రణపరమైన సంభాషణలు కేవలం దేశీయంగానే ఉండిపోకూడదని అన్నారు.

ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు విశ్వసనీయంగా, సదా అందుబాటులో ఉండేలా, సకాలంలో పరిష్కారాలు అందించేలా ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. మార్కెట్లపై విశ్వాసం కేవలం రాబడులపైనే కాకుండా, జరిగిన తప్పులను నిష్పక్షపాతంగా పరిష్కరిస్తారనే హామీపైనా ఆధారపడి ఉంటుందని పేర్కొంటూ... లైసెన్స్ లేని ఆర్థిక సలహాలను నియంత్రణ సంస్థ ఎంత తీవ్రంగా పరిగణిస్తుందో తెలియజేసేలా, నవోదుకాని "ఫిన్-ఫ్లూయెన్సర్ల"పై సెబీ తీసుకున్న చర్యలను శ్రీమతి సీతారామన్ ప్రశంసించారు. "బాధ్యతాయుతమైన ఆర్థిక అవగాహన కోసం మనకు సహాయక విధాన ప్రణాళికలు అవసరం. అయితే వ్యక్తిగత సంపద కోసం అవగాహన లేని రిటైల్ పెట్టుబడిదారులు నమ్మకాన్ని సొమ్ము చేసుకోవడాన్ని మనం సహించకూడదు" అని కేంద్ర ఆర్థిక మంత్రి అన్నారు.

క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులను తగ్గించడానికి, దాని గురించి మరింత అవగాహన కల్పించడానికి ఐఈపీఎఫ్ఏ, మార్కెట్ సంస్థలతో కలిసి సెబీ అనేక ఉమ్మడి 'నివేశక్ శిబిర్' కార్యక్రమాలను నిర్వహించిందని ఆర్థిక మంత్రి శ్రీమతి సీతారామన్ ప్రశంసించారు.

భారత సెక్యూరిటీల మార్కెట్ అంతటా ఉమ్మడి కేవైసీ నిబంధనలను నిర్దేశించడం, కేవైసీ ప్రక్రియలను సరళీకరించడం, డిజిటలైజ్ చేయడంలో సెబీ సహాయం అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి కోరారు. "ఈ రంగంలో నాయకత్వం వహించడానికి సెబీకి పెట్టుబడిదారుల భాగస్వామ్య స్థాయి, బలమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, తోటి నియంత్రణ సంస్థలతో సంస్థాగతమైన విశ్వసనీయత ఉన్నాయి" అని ఆమె అన్నారు.

సంవత్సరాలుగా సెబీ చేపట్టిన నిరంతర సంస్కరణల ప్రయాణం గురించి చైర్మన్ శ్రీ తుహిన్ కాంత పాండే మాట్లాడుతూ... స్క్రీన్-ఆధారిత ట్రేడింగ్‌కు మారడం, డీమెటీరియలైజేషన్‌ను ప్రవేశపెట్టడం, రోలింగ్ సెటిల్‌మెంట్‌లకు వెళ్లడం, కార్పొరేట్ పాలనను బలోపేతం చేయడం, పటిష్ఠమైన రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలను నిర్మించడం వంటి అనేక ప్రాథమిక సంస్కరణలకు సెబీ నాయకత్వం వహించిందన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నేటి వరకు దేశంలో 5,900కు పైగా లిస్టెడ్ కంపెనీలు, 14 కోట్లకు పైగా ప్రత్యేక పెట్టుబడిదారులు ఉన్నారు. గత దశాబ్ద కాలంలో, మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 15 శాతం సీఏజీఆర్ చొప్పున వృద్ధి చెందింది. మ్యూచువల్ ఫండ్ ఆస్తులు ఏటా 20 శాతానికి పైగా విస్తరించాయి. కార్పొరేట్ బాండ్ మార్కెట్ తన స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తోంది. ప్రతి సంవత్సరం, ప్రైమరీ మార్కెట్ దాదాపు రూ. 10 ట్రిలియన్ల మూలధన సమీకరణకు వీలు కల్పిస్తోంది. వ్యాపారం సులభతరం చేయడానికి-నిబంధనలను సరళీకరించడం, ఆప్టిమైజ్ చేయడానికి-అస్పష్టతలను తొలగించడం, సమస్యలను పరిష్కరించడానికి-మూలధన సమీకరణకు వీలు కల్పించడం వంటి విస్తృత శ్రేణి సంస్కరణలను ప్రవేశపెట్టడానికి గత సంవత్సర కాలంలో సెబీ అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపింది.

# మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌లను తిప్పికొడదాం

**– టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాలరావు**

ఖమ్మం, ఏప్రిల్ 25:చికాగో అమరవీరుల త్యాగఫలంతో సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని, మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దుకై కార్మిక వర్గం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాలరావు పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడు మండల పరిధిలోని వెంగన్నపాలెం గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి 140వ మేడే ఉత్సవాల గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం చట్టాన్ని తుంగలో తొక్కి, కార్మికులను కట్టుబానిసలుగా మార్చేలా 12 గంటల పని విధానాన్ని తీసుకు రావాలని ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని, దీనివల్ల కార్మికులకు కనీస వేతనం అందకపోవడమే కాకుండా సమ్మె చేసే హక్కును, ప్రశ్నించే హక్కును కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశంలో ప్రశాంతంగా జీవిస్తున్న కార్మిక వర్గాన్ని కుల, మతాల పేరుతో విభజించి మనుషుల మధ్య తగాదాలు సృష్టించాలని చూస్తున్నారని, ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు సంఘటితమై తిప్పికొట్టాలని ఆయన కోరారు. నియంతలా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మిక వర్గం ఏకతాటిపైకి రావాలని, వాడవాడలా 140వ మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని గోపాలరావు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో కార్మికులపై మోపే భారాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ ముందు వరుసలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినోద్, నాగేష్, మధు, కనకమ్మ, అరుణ, లలిత, చందు, నాగయ్య, శ్రీదేవి, నరేష్, పద్మ, భవాని, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: సీనియర్ సివిల్ జడ్జి జి.రామలింగం



వరంగల్, ఏప్రిల్ 25: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి జి. రామలింగం సూచించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సివిల్ జడ్జి రామలింగం, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.అనూష, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోల్లేటి రామకృష్ణ హాజరై అవగాహన కల్పించారు.

18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలికలకు వివాహం చేస్తే చట్టపరమైన శిక్షలకు గురవుతారని వారు హెచ్చరించారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలికలకు వివాహం చేస్తే మానసిక పరమైన వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు.

# ఏజెన్సీ కోర్టు కేసులను త్వరగా పరిష్కరించాలి

**–సబ్ కలెక్టర్ యువరాజ్ మరమ్మత్**

ఆదిలాబాద్, ఏప్రిల్ 25: ఏజెన్సీ కోర్టు సివిల్ ప్రొసీజర్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. శనివారం ఉదయం సబ్-కలెక్టర్ పర్యవేక్షణలో పనిచేస్తున్న ఉట్నూరులోని ఏజెన్సీ కోర్టు, 100 సివిల్ ప్రొసీజర్ కోడ్ (సీపీసీ ) కేసులను విచారణకు స్వీకరించింది. సబ్-కలెక్టర్ ఈ కేసులను సమీక్షించి, సంబంధిత పక్షాలకు న్యాయం జరిగేలా చూడటానికి సకాలంలో పరిష్కరించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

ప్రక్రియను వేగవంతం చేయడానికి, విచారణలలో పారదర్శకతను పాటించడానికి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు సబ్ కలెక్టర్ జారీ చేశారు.ఈ చొరవ, ఏజెన్సీ ప్రాంతంలో సమర్థవంతమైన కేసుల నిర్వహణకు, ఫిర్యాదుల వేగవంతమైన పరిష్కారానికి పరిపాలన యంత్రాంగం యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, అధికారులు కేసులకు సంబంధించిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వేసవి సెలవులు నైపుణ్య వికాస శిక్షణకు నెలవులు కావాలి

**– కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు**



హైదరాబాద్, ఏప్రిల్ 25:ప్రతి విద్యార్థికి వేసవి సెలవులు వ్యక్తిత్వ, నైపుణ్యాలను పెంపొందించుకునే నెలవులు కావాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, కవి, రచయిత, కాలమిస్ట్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు తిమ్మాపూర్ సమీప మహాత్మా జ్యోతిబాయి పూలే తెలంగాణ బి సి సంక్షేమ బాలికల విద్యాలయ ప్రాంగణంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 15 రోజుల వేసవి శిక్షణా శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ, ప్రతి ఒక్క విద్యార్థినీ తమకు ఇష్టమైన రంగంలో కళలను పెంపొందించుకోవాలని సూచించారు. ఊడ్చి నేర్చుకోవడం, సైకిల్ తొక్కడం, తమకు నచ్చిన క్రీడల్ని ఆడడం, కంప్యూటర్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం, దర్శనీయ స్థలాలను సందర్శించడం, స్నేహితులతో సరదాగా గడపడం, బంధువులతో సంబంధాలను పెంపొందించుకోవడం, సృజనశీల ఆలోచనలను చేయడం, నచ్చిన పుస్తకాలను చదువుకోవడం లాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఉత్తమమైన మార్గమని అన్నారు. పాఠశాల పాఠ్యాంశాలకు దూరంగా తమకు ఇష్టమైన అంశాల్లో శిక్షణ తీసుకోవాలని సూచించారు. నాట్యం, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, పేయింటింగ్ లాంటి రంగాల్లో చొరవ తీసుకొని పరిణితిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కంప్యూటర్ శిక్షణా తరగతుల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యాలయ ప్రిన్సిపల్ డా పి సరిత అధ్యక్షతన వహించగా, రిజినల్ కోఆర్డినేటర్ అంజలి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, మెదక్ జిల్లాలకు చెందిన 334 మంది బాలికలు వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు.

# అమ్మవారి అనుగ్రహమే గ్రామాభివృద్ధికి మూలం

**– ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

మెదక్, ఏప్రిల్ 25:తొగుట మండలం వెంకట్రావుపేటలో వెలసిన శ్రీ చౌడాలమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవం భక్తి, శ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగుతోంది. ఈ పవిత్ర వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. చౌడాలమ్మ తల్లి కటాక్షంతో ప్రజలందరూ ధాన్య సంపదతో, పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. 'అమ్మవారి అనుగ్రహమే గ్రామాభి వృద్ధికి మూలం. దేవీ దయ ఉంటే దరిద్రం దూరమై, సిరిసంపదలు వెల్లివిరుస్తాయి' అని విశ్వాసం వ్యక్తం చేశారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ తొగుట మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, సర్పంచులు బండారు కవిత స్వామి గౌడ్, పన్యాల ప్రవీణ్ రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షులు పాత్కుల ఎల్లయ్య, నాయకులు బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, చిలువేరి మల్లారెడ్డి, వేల్పుల స్వామి, మంగ నర్సింలు, మాదాసు అరుణ్ కుమార్, లక్ష్మారెడ్డి, పులిగారి శివయ్య, పెంటోజీ, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మా జీవన ఆధారాన్ని కాపాడండి..

**–తిరువూరు శాసనసభ్యులు కొలికిపూడి శ్రీనివాసరావుకు రైతుల వినతి**

అమరావతి, ఏప్రిల్ 25:మా జీవనాధారమైన వ్యవసాయ భూములను కాపాడాలని కోరుతూ, క్వాంటం వ్యాలీ ఏపీ ఐఐసీ ద్వారా కార్పొరేట్ కంపెనీల స్థాపన పేరుతో భూములు స్వాధీనం చేసుకునే ప్రక్రియను నిలుపుదల చేయాల్సిందిగా చీమలపాడు రెవెన్యూ పరిధిలోని కోమటికుంట గ్రామ రైతులు శనివారం తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావును వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, పంటలపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలకు భూముల కోల్పోవడం తీవ్రమైన ఆర్థిక, సామాజిక సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. పలు తరాలుగా సాగుచేస్తున్న భూములు తమకు కేవలం ఆస్తి మాత్రమే కాకుండా జీవనాధారం, సంస్కృతి, భవిష్యత్తు అని వివరించారు. దీనిపై స్పందించిన శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కోమటికుంట గ్రామంలో ఎంత మేరకు సాగుభూములు ఉన్నాయో, ఎన్ని ఎకరాలు ప్రభావితమవుతున్నాయో రెవెన్యూ అధికారుల ద్వారా సమగ్ర సమాచారం సేకరిస్తామని తెలిపారు. గ్రామంలోని రైతులందరితో కలిసి ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు, సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అభివృద్ధి, రైతుల హక్కులు రెండూ సమానంగా పరిరక్షించబడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలు రావడం వల్ల స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, రైతులకు నష్టం కలగకుండా సరైన పరిహారం, పునరావాసం కల్పించి న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత శాఖ మంత్రులకు తెలియజేసి రైతుల పక్షాన నిలుస్తామని స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని,ప్రతి రైతుకు న్యాయం జరిగే వరకు తమ కృషి కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి, వేములకొండ సాంబశివరావు, వేములకొండ రామకృష్ణ, చీపు వెంకటేశ్వరరావు, కానగాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 25 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తిగా నేరవేర్చడం లేదని దీంతో లబ్ధిదారుల్లో తీవ్రమైన నిరాశ కనబడుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే దివ్యాంగులకు త్రీ వీలర్ వెహికల్స్, అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు కేసీఆర్ ఇచ్చిన లక్ష తప్ప తులం బంగారం ఇంకెప్పుడిస్తారని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ విషయం గురించి మహిళల్లో తీవ్రంగా చర్చ జరుగుతుందని, ఆడపిల్ల పెండ్లికి తులం బంగారం త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారంటే అది కాంగ్రెస్ పాపమేనని, కార్మికుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వానిదే భాధ్యత అన్నారు.

# ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్

అమరావతి, ఏప్రిల్ 25:ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిన్ లిసా గిల్ నియమితులయ్యారు. శనివారం సాయంత్రం లోక్‌భవన్‌లో ఆమె సీజేగా ప్రమాణం చేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు సీజేను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు సీజేగా బాధ్యతలు నిర్వహించిన ధీరజ్ సింగ్ ఠాకుర్ పదవి విరమణ చేయడంతో అతడి స్థానంలో చండిగఢ్ రాష్ట్రానికి చెందిన లిసా గిల్‌ను కేంద్రం ఏపీ సీజేగా నియమించింది.




# మేధో సంపత్తి: మానవ సృజనాత్మకతకు చట్టబద్ధ పట్టాభిషేకం

మానవ మేధస్సు నుండి ఉద్భవించే అద్భుత సృజనలకు, నూతన ఆవిష్కరణలకు పట్టాభిషేకం చేస్తూ అంతర్జాతీయ సమాజం జరుపుకునే ఉత్సవమే 'ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం'. ప్రతి ఏటా ఏప్రిల్ 26న నిర్వహించే ఈ వేడుక కేవలం ఒక క్యాలెండర్ తేదీ మాత్రమే కాదు; అది మానవ ఆలోచనా శక్తికి లభించిన చట్టబద్ధమైన గౌరవం. భూమిపై ఉన్న వనరుల కంటే మనిషి మెదడులో మొలకెత్తే ఆలోచనలే అత్యంత విలువైనవని గుర్తించిన నాడే ఆధునిక నాగరికతకు అసలైన పునాది పడింది. మేధో సంపత్తి అంటే కేవలం సాంకేతిక ఆవిష్కరణలు లేదా పారిశ్రామిక రూపకల్పనలు మాత్రమే కావు. ఒక కవి కలం నుండి జాలువారే కవిత్వం, ఒక శాస్త్రవేత్త కనిపెట్టే ఔషధ సూత్రం, ఒక చిత్రకారుడు గీసే అద్భుత వర్ణచిత్రం, ఒక వ్యాపారవేత్త సృష్టించే బ్రాండ్ చిహ్నం – ఇలా మానవ మేధస్సు సృష్టించిన ప్రతి అంశం ఈ పరిధిలోకి వస్తుంది. ఈ మేధో సంపత్తికి రక్షణ కల్పించడం అంటే ఆ సృజనకారుడి శ్రమను, మేధస్సును దోపిడీకి గురికాకుండా చూడటమే.

చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, మేధో సంపత్తి హక్కుల పరిరక్షణకు 19వ శతాబ్దంలోనే బీజం పడింది. పారిశ్రామిక విప్లవం పతాక స్థాయిలో ఉన్న సమయంలో, ఆవిష్కరణలను రక్షించు కోవాల్సిన ఆవశ్యకతను గుర్తించి 1883లో 'పారిస్ కన్వెన్షన్'ను ఏర్పాటు చేశారు. ఇది పారిశ్రామిక ఆస్తి రక్షణకు అంతర్జాతీయ చట్టబద్ధత కల్పించింది. దీనిని అనుసరిస్తూనే, 1886లో సాహిత్య మరియు కళాత్మక రచనల రక్షణ కోసం 'బెర్న్ కన్వెన్షన్' ఉనికిలోకి వచ్చింది. ఈ రెండు చారిత్రక ఒప్పందాలు ప్రపంచ మేధో సంపత్తి వ్యవస్థకు దిశానిర్దేశం చేశాయి. కాలక్రమేణా, ఈ హక్కుల అమలును పర్యవేక్షించడానికి 1967లో 'ప్రపంచ మేధో సంపత్తి సంస్థ' స్థాపించబడింది. ఈ సంస్థ ఐక్యరాజ్య సమితిలో భాగంగా పనిచేస్తూ, ప్రపంచ వ్యాప్తంగా మేధో సంపత్తి రక్షణకు సమన్వయకర్తగా వ్యవహరిస్తోంది. ఈ సంస్థ ఆవిర్భవించిన రోజును పురస్కరించుకుని, 2000వ సంవత్సరం నుండి ఏప్రిల్ 26ను అధికారికంగా ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవంగా జరుపు కుంటున్నాము.

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మేధో సంపత్తి అనేది ఒక దేశపు శక్తి సామర్థ్యాలకు కొలమానంగా మారింది. మరీ ముఖ్యంగా సమాచార సాంకేతికత , ఔషధ రంగం , బయోటెక్నాలజీ, వినోద పరిశ్రమలు మేధో సంపత్తిపైనే ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి. ఒక నూతన ఔషధాన్ని మార్కెట్లోకి తీసుకురావడానికి లేదా ఒక అత్యాధునిక చిప్‌ను రూపొందించడానికి శాస్త్రవేత్తలు కొన్ని దశాబ్దాల పాటు పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం బిలియన్ల కొద్దీ నిధులు వెచ్చించాల్సి వస్తుంది. ఒకవేళ ఆ మేధో శ్రమకు 'పేటెంట్' రక్షణ లేకపోతే, ఇతరులు ఆ సూత్రాన్ని సులభంగా కాపీ చేసి తక్కువ ధరకు విక్రయించే ప్రమాదం ఉంది. దీనివల్ల అసలైన ఆవిష్కర్త తీవ్రంగా నష్టపోవడమే కాకుండా, భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణలు చేయడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే పేటెంట్లు, ట్రేడ్‌మార్కులు, కాపీరైట్లు అనేవి ఆవిష్కర్తలకు




ఇచ్చే ప్రోత్సాహకాలు మాత్రమే కాదు, అవి ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే ఇంధనాలు.

ప్రపంచ వ్యాప్తంగా పేటెంట్ దాఖలుల గణాంకాలను గమనిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. ప్రస్తుతం చైనా ఈ రంగంలో అగ్రగామిగా దూసుకుపోతోంది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ వంటి దేశాలు కూడా అత్యధిక సంఖ్యలో పేటెంట్లను నమోదు చేస్తున్నాయి. ఈ దేశాలు తమ స్థూల జాతీయోత్పత్తిలో గణనీయమైన వాటాను పరిశోధన మరియు అభివృద్ధి కోసం కేటాయించడం వల్లే ప్రపంచ మార్కెట్లో పైచేయి సాధించ గలుగుతున్నాయి. భారతదేశం కూడా గత రెండు దశాబ్దాల్లో ఈ దిశగా అద్భుతమైన ప్రగతిని సాధించింది. ఒకప్పుడు కేవలం సేవా రంగానికే పరిమితమైన భారత్, నేడు 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' వంటి పథకాల ద్వారా ఆవిష్కరణల కేంద్రంగా మారుతోంది. 2023-24 నాటికి భారతదేశంలో పేటెంట్ దరఖాస్తుల సంఖ్య 90, 000 మార్కును దాటడం విశేషం. ప్రపంచ మేధో సంపత్తి సూచీలో భారత్ తన ర్యాంకును నిలకడగా మెరుగు పరుచుకు ంటూ వస్తోంది. దేశీయంగా తయారయ్యే సాంకేతికతకు రక్షణ కల్పించడంలో భారత మేధో సంపత్తి కార్యాలయాలు చురుకైన పాత్ర పోషిస్తున్నాయి.

అయితే, మేధో సంపత్తి హక్కుల అమలులో పెను సవాళ్లు కూడా పొంచి ఉన్నాయి. ప్రధానంగా డిజిటల్ యుగంలో పైరసీ మరియు కాపీరైట్ ఉల్లంఘనలు పెను భూతంగా మారాయి. సినిమా, సంగీతం వంటి సృజనాత్మక రంగాల్లో కష్టపడి సృష్టించిన కంటెంట్‌ను ఇంటర్నెట్ ద్వారా అక్రమంగా పంపిణీ చేయడం వల్ల కళాకారులు భారీగా నష్టపోతున్నారు. అలాగే, నకిలీ ఉత్పత్తుల తయారీ వల్ల బ్రాండ్ల విలువ పడిపోవడమే కాకుండా వినియోగదారుల ఆరోగ్యానికి కూడా ముప్పు వాటిల్లుతోంది. మరీ ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒక క్లిష్టమైన సమస్య ఎదురవుతోంది. ప్రాణ రక్షక ఔషధాల విషయంలో పేటెంట్ హక్కులు ఎంత ముఖ్యమో, సామాన్య ప్రజలకు అవి అందుబాటు ధరలో ఉండటం కూడా అంతే ముఖ్యం. పరిశోధనా ఖర్చులను రాబట్టు కోవడానికి కంపెనీలు అధిక ధరలు నిర్ణయిస్తే, పేద దేశాల్లో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే 'కంపల్సరీ లైసెన్సింగ్' వంటి నిబంధనల ద్వారా ప్రజారోగ్యానికి, పేటెంట్ హక్కులకు మధ్య సమతుల్యత సాధించడానికి అంతర్జాతీయ చట్టాలు ప్రయత్నిస్తున్నాయి. మేధో సంపత్తి కేవలం ఆధునిక పరిజ్ఞానానికే పరిమితం కాదు; ఇది మన సంస్కృతిని, సంప్రదాయాలను కూడా రక్షిస్తుంది. దీనికి ఉత్తమ ఉదాహరణ 'జియోగ్రాఫికల్ ఇండకేషన్' . ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలో పండే పంటలు లేదా తయారయ్యే ఉత్పత్తులకు ఇచ్చే గుర్తింపు ఇది. భారతదేశంలో దార్జిలింగ్ టీ, తిరుపతి లడ్డు, కొండపల్లి బొమ్మలు, ఉప్పాడ జమిదానీ చీరలు వంటి వందలాది ఉత్పత్తులు జీఐ ట్యాగ్ పొందాయి. దీనివల్ల ఆయా ప్రాంతాల కళాకారులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడమే కాకుండా, నకిలీ ఉత్పత్తుల నుండి వారి జీవనోపాధికి రక్షణ లభిస్తుంది. అలాగే, భారతీయ ఆయుర్వేద, యోగా వంటి ప్రాచీన విజ్ఞానాన్ని ఇతరులు తమదిగా క్లెయిమ్ చేసుకోకుండా 'ట్రెడిషనల్ నాలెడ్జ్ డిజిటల్ లైబ్రరీ' వంటి వేదికలు రక్షణ కవచంలా పనిచేస్తున్నాయి.

రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలు మేధో సంపత్తి రంగాన్ని సమూలంగా మార్చ బోతున్నాయి. ఒక ఏఐ సాఫ్ట్‌వేర్ రాసిన పాట లేదా సృష్టించిన చిత్రానికి హక్కుదారు ఎవరు.. యంత్రం స్వయంగా ఒక ఆవిష్కరణ చేస్తే దానికి పేటెంట్ ఎవరికి ఇవ్వాలి.. డేటా సేకరణలో గోప్యతను ఎలా కాపాడాలి.. వంటి ప్రశ్నలు ప్రస్తుతం అంతర్జాతీయ మేధోమథనానికి కారణమవుతున్నాయి. భవిష్యత్తులో ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి కొత్త చట్టపరమైన చట్రాలు అవసరమవుతాయి. ముగింపుగా చెప్పాలంటే, ప్రతి ఏటా ఏప్రిల్ 26న నిర్వహించే ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం మనలో ఒక నూతన చైతన్యాన్ని నింపాలి. మేధో సంపత్తి హక్కులు అంటే కేవలం చట్టాల పుస్తకాల్లోని నిబంధనలు కావు; అవి రేపటి తరానికి మనం అందించే స్ఫూర్తి. సృజనాత్మకతను గౌరవించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఇతరుల మేధో శ్రమను దోచుకోకుండా ఉండటం అనేది ప్రతి పౌరుడి నైతిక బాధ్యత. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు మేధో సంపత్తి ప్రాముఖ్యతను బోధించాలి. మేధస్సును ఆస్తిగా మార్చుకోగలిగిన దేశమే ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలుస్తుంది. అవగాహన, అమలు, సంరక్షణ అనే మూడు సూత్రాలతో ముందుకు సాగితేనే మానవ మేధస్సు మరింత వికసిస్తుంది, తద్వారా లోకకళ్యాణం సిద్ధిస్తుంది. మన ఆలోచనలకు రెక్కలు తొడిగి, వాటిని చట్టబద్ధమైన రక్షణతో ప్రపంచ వ్యాప్తం చేయడమే ఈ దినోత్సవం యొక్క అసలైన అంతరార్థం. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న సరికొత్త సాంకేతిక యుగంలో మేధో సంపత్తి లేని ఆర్థిక ప్రగతి అసంపూర్ణం. అందుకే దీన్ని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

## మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహార్ పరామర్శ



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లిలో గుండెపోటుతో మృతి చెందిన చిలువేరి శివగౌడ్ (30), శాత్రాజుపల్లెలో అనారోగ్యంతో కన్నుమూసిన లింగంపల్లి సుధాకర్(30) భౌతికకాయాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీలం శేఖర్, మాజీ ఉపసర్పంచ్ నాంపల్లి, శివరాత్రి శ్రీనివాస్, మెట్ట దేవానంద్, గుడిసె సదానందం, మాజీ ఎంపీటీసీ ఉపేందర్, బొడ్డు ప్రభాకర్, నల్ల సతీశ్‌రెడ్డి, పురుషోత్తం, విక్కుర్తి సాయిగౌడ్, గుడిసె అనిల్, మల్లారం తిరుపతి, బండ మహేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు

## కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ సత్తా..

### - కోఆప్షన్ ఎన్నికల్లో 5/5 కైవసం- బండి సంజయ్ వ్యూహం ఫలితం



కరీంనగర్, ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి) కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికల్లో బీజేపీ ఆధిపత్యం ప్రదర్శించింది. మొత్తం ఐదు స్థానాల్లో ఐదింటినీ కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ సాధించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ ఎన్నికల్లో పార్టీ వ్యూహం సక్సెస్ అయింది. బీఆర్ఎస్‌లో చీలికలు ఓటింగ్ సమయంలో బీఆర్ఎస్‌లో విభేదాలు బహిర్గతమయ్యాయి. నలుగురు కార్పొరేటర్లు బీజేపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వడం రాజకీయంగా చర్చనీయా ంశమై ంది. మొత్తం 38 మంది సభ్యుల మద్దతుతో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించా రు.సామా న్యులకు ప్రాధాన్యంపార్టీ కోసం కష్టపడ్డ సాధారణ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. మైనార్టీ విభాగంలో ముజీబ్, సిక్కు సమా జానికి చెందిన బల్వీర్ సింగ్, నిరుపేద కార్యకర్త నందన్ కుమా ర్‌కు అవకాశం ఇవ్వడం విశేష ం.సామాజిక సమీకరణంఎస్సీ మహిళా విభాగంలో చిగురు వెంకటమ్మకు, వైశ్య వర్గానికి చెందిన కన్నె కృష్ణకు అవకాశం కల్పిస్తూ అన్ని వర్గాల కు ప్రాతి నిధ్యం కల్పించారు.కాంగ్రెస్ దూరంఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీకి దూరంగా ఉండగా, బీఆర్ఎస్ ఓటింగ్‌లో వెనుకబ డింది.పార్టీలో సంబరాలు సామా న్య కార్యకర్తలకు పదవులు ఇవ్వ డంపై బీజేపీ శ్రేణుల్లో సంబరాలు నెలకొన్నాయి. బండి సంజయ్ నిర్ణయంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## డిపిఆర్ఓను కలిసిన కళాకారుల విభాగం ప్రతినిధులు




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ)గా బాధ్యతలు స్వీకరించిన ఏడుకొండలుని కళాకారుల విభాగం రాష్ట్ర ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్, కళాతపస్వి యెల్ల పోశెట్టి నేతృత్వంలో రాష్ట్ర కమిటీ తరఫున వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి చిత్రపటం, లడ్డు ప్రసాదం, కండువా అందజేసి సత్కరించారు. అలాగే యెల్ల పోశెట్టి జన్మదిన అభినందన సంచికను కూడా ఈ సందర్భంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు, రంగస్థల కళాకారులు, కళాకారుల విభాగం జిల్లా అధ్యక్షులు వారాల దేవయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ, డప్పు నృత్య కళాకారులు, జిల్లా ఉద్యమ కళాకారుల ఫోరం ఉపాధ్యక్షులు బొడ్డు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల నమోదుకు ప్రజలు సహకరించాలి - తహశీల్దార్ జయంత్ కుమార్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి): దేశ వ్యాప్తంగా చేపడుతున్న జనాగణన జనాభా లెక్కల నమోదుకు సహకరించాలని, స్వీయ గణన ద్వారా పూర్తి సమాచారాన్ని ఆన్లైన్ చేసుకోవాలని వేములవాడ తహశీల్దార్ జయంత్ కుమార్ కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో జయంత్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మన గ్రామం,మన రాష్ట్రం, మన దేశం, అభివృద్ధి చెందాలంటే ముందుగా జనాభా లెక్కల నమోదు కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావాలని, అలా పూర్తి కావాలి అంటే ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండి జనగణనకు సహకరించాలని కోరారు.దేశవ్యాప్తంగా చేపడుతున్న జనాభా లెక్కల నమోదుకు ప్రజలు సహాకరించాలని, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు ఆన్లైన్ నమోదు కొనసాగుతుందని తెలిపారు. స్వీయ గణన అనగా ఆన్లైన్ లో మీకు సంబందించిన పూర్తి వివరాలను ప్రభుత్వ వెబ్సైట్ లో మీరే నమోదు చేసుకునే అవకాశం ఉందని అన్నారు.ఆన్లైన్ లో జన గణన నమోదు చేసుకోవడం ద్వారా సమయం ఆదా అవుతుందని అన్నారు. కుటుంబ వివరాలు, ఫోన్ నంబర్, జిల్లా, పట్టణం, గ్రామం,.పిన్ కోడ్, వివరాలతో పాటు మీ ఇంటి వివరాలు,ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని, ఇంటి వద్ద లోకేషన్ ఆన్ చేసి అస్థలంలో రెడ్ మార్క్ చేసిన అనంతరం సబ్మిట్ చేయాలని పేర్కొన్నారు. ఆ తర్వాత ఒక ఐడీ నంబర్ వస్తుందని, మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఎస్ ఐడీ చూపిస్తే అప్రూవ్ చేస్తారని అన్నారు. దేశ జనాభా లెక్కలు అంటే వట్టి లెక్కలు కావని, మన అభివృద్ధికి పునాది, భవిష్యత్ కు బంగారు దారి అని అన్నారు. ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు జరగాలంటే జనాభా లెక్కలు తప్పని సరని అన్నారు. జనాభా లెక్కల నమోదు వల్ల రేషన్ కార్డులు తొలగిపోతాయని ప్రభుత్వ పథకాలు రావనే భయభ్రాంతులకు గురి కావద్దని సూచించారు.ప్రతి ఒక్కరూ అవగాహనతో జనాభా లెక్కల కార్యక్రమన్నీ విజయవంతం చేయాలని ప్రజలకు సూచించారు.

## పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి

### -సీనియర్ సివిల్ జడ్జి శ్యామ సుందర్



నల్గొండ, ఏప్రిల్ 25:పదేండ్లకు పైగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని, అవసరమైతే ఈరోజు నుండి రేపటికి దినసరి వాయిదాలు వేసైనా త్వరితగతిన పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న న్యాయమూర్తులను ఆదేశించిందని, అందువల్ల అట్టి కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యామ సుందర్ న్యాయవాదులను కోరారు. శనివారం ఆయన సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయపీఠానికి, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి మధ్య మంచి సంబంధాలు ఉన్నప్పుడే కోర్టు కార్యకలాపాలు సజావుగా సాగుతాయని ఆ సహకారాన్ని న్యాయవాదుల నుండి తాను ఆశిస్తున్నానన్నారు.

ప్రతి కోర్టులోనూ 1/3వ వంతు సిబ్బంది మాత్రమే పని చేస్తున్నారని ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్కరే చేయవలసి రావడం మూలంగా వారిపై పని ఒత్తిడి భారీగా పెరిగిందని దీనిని అర్థం చేసుకుని న్యాయవాదులు వారితో ఘర్షణ పడకుండా సామరస్య పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పాత కేసుల విచారణ సమయంలో న్యాయవాదులు వాయిదాలు తీసుకోవడం మాని వేయాలని విచారణకు సిద్ధంగా ఉండి న్యాయ పీఠానికి సహకరించాలన్నారు. కోర్టులో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 2020వ సంవత్సరం నుండి సివిల్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అంతకు మునుపు ఒక నెలలో రెండు మూడు దావాలు కోర్టులో దాఖలు అయ్యేవని 2020 తర్వాత ఆ సంఖ్య నెలకు 15 నుండి 20 వరకు పెరిగిందని దీనంతటికీ కారణం స్థిరాస్తుల విలువ పెరగడమేనన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నారపరాజు శ్రీనివాసరావు, ఆర్ వి రమణారెడ్డి, ఉపాధ్యక్షులు జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నట్టే సత్యనారాయణ, కుక్కడపు బాలకృష్ణ, అంబటి శ్రీనివాస్ రెడ్డి, నాగేష్ రాథోడ్, కోలా రమాదేవి, సమీనా, జుట్టు కొండ సంధ్య, దీపిక, ధూళిపాల శ్రీనివాసరావు, గొట్టే ప్రశాంత్, బుడిగె నరేష్, చిట్టి పోతుల రమేష్, నాగపాష, సతీష్, ఎంఎస్ రాఘవరావు, మీసాల అంజయ్య, ఏజీపీలు రేణుకాదేవి, సురేష్ నాయక్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

### –లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి): బాల్య వివాహాలు పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, ఈ సామాజిక సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం, అధికారులు, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఆడెపు వేణు తెలిపారు. శనివారం కోనరావుపేట మండలం జై సేవాలాల్ భూక్య రెడ్డి తండా (వట్టిమల్ల)లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ ఆదేశాలతో, సీనియర్ సివిల్ జడ్జి/డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. లక్ష్మణాచారి సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆడెపు వేణు మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా 'ఆశా–2025' ( అవేర్ నెస్, హెల్ప్ అండ్ యాక్షన్) కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహం జరుగుతుందనే సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బాధితులకు సహాయం అందించడం ద్వారా మాత్రమే ఈ సమస్యను పూర్తిగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు గుర్రం ఆంజనేయులు, న్యాయవాది తవుటు మధుసూ దన్, గ్రామ సర్పంచ్ బానోత్ నరేష్ నాయక్, ఉప సర్పంచ్ లకవత్ రాజు, ఏఎస్ఐ ఎన్. తిరుమల బాబు, కానిస్టేబుల్ జగన్ తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది.. రైతులతో కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 25: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం రాశుల వద్ద ఆగి రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వం వడ్లు కొంటే మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందని కొనటం లేదని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెల రోజుల నుంచి కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకొస్తే ఇప్పటి వరకు ఒక్క గింజ కొన్న పాపాన పోలేదని..రైస్ మిల్ కేటాయించపోతే ఎవరు కొనాలి.. ఎలా తూకం వేయాలని ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. దళారులకు అప్పగిస్తే వాళ్లు ఇంత కమిషన్ ఇసారు.. అందుకే కొనకుండా వదిలేశారన్నారు. .రైతుబంధు అని చెప్పి అది కూడా ఇవ్వడం లేదు. సిరిసిల్లలో అధికారులను అడిగితే 1000 క్వింటాళ్లు కూడా వడ్లు కొనలేదని అంటున్నారు. అకాల వర్షం వచ్చి ధాన్యం తడిసి పోయి పాడైపోతుందని రైతులు టార్పలిన్ కవర్లు కొని కప్పుకుంటున్నారు. ఇంత దౌర్భాగ్యమైన ప్రభుత్వం ఎక్కడా చూడలేదని కేటీఆర్ మండిపడ్డారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**